

సిరా చుక్క

తండ్రి - కూతురు బంధం
బుడిబుడి అడుగుల తొలి పాఠం
తండ్రినాన్న చేతి వేలిలో నడిచే లోకం
కూతురు కలల కొలనులో
విరిసే కలువ పువ్వు
కంటి రెప్పలా కనిపెట్టుకునే అనురాగం
అలిగినా మురిపించే చిలిపి వసంతం
అడిగే ముందే అందించే
నిశ్శబ్ద ఆశీర్వాదం
వయసు పెరిగినా
తరగని బాల్యపు ముచ్చట
కన్నీటి చుక్కను తుడిచే ఆత్మీయ స్పర్శ
కాలం మారినా వాడని పన్నీటి జ్ఞాపకం
హృదయపు లోతుల్లో
పదిలంగా దాచుకునే వరం

కొయ్యడ అనిల్ కుమార్
హుస్నాబాద్..
సిద్దిపేట జిల్లా బ్యూరో చీఫ్



ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:120 | ఎడిటర్: మేనం శ్యామ్ | శనివారం 21-11-2026 | పేజీలు: 13

ఆదాయం మాది.. అధికారం ఉత్తరాదిదా.?

- జనాభా లెక్కలతో దక్షిణాదికి రాజకీయ అన్యాయం చేయొద్దు
- లోక్‌సభ సీట్ల పెంపులో జీడీపీని ప్రాతిపదికగా తీసుకోవాలి
- 50 శాతం స్థానాల పెంపుతో దక్షిణాది ప్రాతినిధ్యానికి గండి
- ఉత్తరాది సీట్లతోనే కేంద్రంలో అధికారం చేపట్టే ప్రమాదం
- 'సదరన్ రైజింగ్ సమ్మిట్–2026'లో సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



ప్రజా వాయిస్,హైదరాబాద్: దేశాభివృద్ధికి దక్షిణాది రాష్ట్రాలు వెన్నెముకగా నిలుస్తుంటే.. పార్లమెంటులో వాటి ప్రాతినిధ్యానికే కోత పడాలా? జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు రాజకీయంగా అన్యాయం జరగాలా? లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేవనెత్తిన ప్రశ్నలివి. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు చేపడితే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యం తగ్గిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ఒక్కటే కొలమానం కాకూడదని, రాష్ట్రాల ఆర్థిక ప్రగతి, జీడీపీని కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచి జనాభా ఆధారంగా కేటాయిస్తే ఉత్తరాది రాష్ట్రాల సీట్ల సంఖ్య భారీగా పెరిగి, వాటి ఆధారంగానే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితులు తలెత్తవచ్చని హెచ్చరించారు. దేశానికి ఆర్థికంగా గణనీయమైన తోడ్పాటు అందిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భంగం కలగకుండా పునర్విభజన చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్–2026' మీడియా కాంక్లేవ్‌లో సీఎం చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

అభివృద్ధి చేస్తే ప్రాతినిధ్యం తగ్గించడమా.?

జనాభా నియంత్రణ, ఆర్థిక ప్రగతి, అభివృద్ధి కార్యక్రమాల్లో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు పునర్విభజనలో తగిన న్యాయం జరగాలని సీఎం అభిప్రాయపడ్డారు. కేవలం జనాభా లెక్కల ఆధారంగా సీట్ల కేటాయింపు జరిగితే రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. జనాభాతోపాటు జీడీపీని కూడా పరిగణనలోకి తీసుకోవడం ద్వారానే సముచిత ప్రాతినిధ్యం సాధ్యమవుతుందని వివరించారు.

పేదవాడి అభ్యున్నతే అసలైన అభివృద్ధి

దేశాభివృద్ధిలో కాంగ్రెస్ అనుసరించిన విధానాలను సీఎం ప్రస్తావించారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూలు ప్రతి పేదవాడి అభ్యున్నతినే నిజమైన అభివృద్ధిగా భావించారని గుర్తు చేశారు. నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అనేక విద్యాసంస్థలు, నీటిపారుదల ప్రాజెక్టులు ఏర్పాటు చేశారని తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను మన్మోహన్‌సింగ్ కొనసాగించారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ అభివృద్ధి నమూనా అని వివరించారు.

2047 నాటికి తెలంగాణ విశ్వవేదికపై

తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు 'తెలంగాణ రైజింగ్–2047' విజన్ రూపొందించినట్లు సీఎం వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గడిచిన మూడేళ్లలో 65 శాతం కార్యక్రమాలు అమలు చేశామని, మిగిలిన వాటిని వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

మిగతా 2లో

డేటింగ్ యాప్‌లో డేంజర్ గేమ్.!

- స్నేహం పేరుతో వల.. బీరులో మత్తు.. బంగారంపై కన్ను
- గ్రిండర్ ద్వారా ఎల్ జీబీటీక్యూ సభ్యులే లక్ష్యం
- అందమైన యువకుల పేర్లతో నకిలీ ఖాతాలు
- వీడియో కాల్స్ తో బాధితుల వివరాల సేకరణ
- ప్రైవేట్ గదులకు రప్పించి మత్తుమందు ప్రయోగం.. స్పృహ తప్పగానే దోపిడీ
- ఏడాదిలో 20కి పైగా నేరాలు.. ఐదుగురు అరెస్ట్
- 36 తులాల బంగారం స్వాధీనం
- ముఠా గుట్టురట్టు చేసిన మల్కాజిగిరి పోలీసులు

2 లో

పల్లె నుంచి నగరం వరకు ఎన్నికల వేడి

- ఎంపీటీసీ, జెడ్పీటీసీతో పాటు మూడు కార్పొరేషన్ల ఎన్నికలపై ఉత్కంఠ
- షెడ్యూల్ కోసం రాజకీయ పార్టీల ఎదురుచూపులు



ప్రజా వాయిస్ డెస్క్, హైదరాబాద్. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలుకానుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, మరోవైపు హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్ల ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠ నెలకొంది. డిసెంబర్ చివరి వారంలో లేదా వచ్చే ఏడాది జనవరి తొలి వారంలో పోలింగ్ జరిగే అవకాశాలున్నాయన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే ఎన్నికల తేదీలు, షెడ్యూల్‌పై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.గ్రామీణ ప్రాంతాల్లో 5,773 ఎంపీటీసీ, 566 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికైన ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో పలు స్థానిక సంస్థలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించి స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధుల పాలనను పునరుద్ధరించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఓటరు జాబితాల సవరణ, వార్డులు, గ్రామాల వారీగా ఓటర్ల వివరాల విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలు ఎన్నికల నిర్వహణలో కీలకంగా మారనున్నాయి.మరోవైపు హైదరాబాద్ నగర రాజకీయాల్లోనూ ఎన్నికల వేడి రాజుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతంలో ఒకే గొడుగు కింద ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా పునర్వ్యవస్థీకరించింది. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ మూడు కార్పొరేషన్ల పరిధిలో రాజకీయంగా పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీలు వ్యూహరచన చేసే అవకాశం ఉంది.కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలాబలాలు, నాయకుల ప్రజాదరణ, ప్రభుత్వ పథకాల అమలు, స్థానిక సమస్యలపై ప్రజల స్పందనకు ఈ ఎన్నికలు పరీక్షగా నిలవనున్నాయి. టికెట్ల కోసం ఆశావహులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభిస్తుండగా, అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు, స్థానిక నాయకుల మద్దతు కూడగట్టడంపై పార్టీల్లో అంతర్గత చర్చలు సాగుతున్నాయి.పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ట్రాఫిక్ సమస్యలు ప్రధాన ఎన్నికల అజెండాగా మారే అవకాశముంది. గ్రామాల్లో తాగునీరు, అంతర్గత రహదారులు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఓటర్లను ప్రభావితం చేయనున్నాయి. ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండే స్థానిక ప్రజాప్రతినిధుల ఎంపికపై ఆసక్తి పెరుగుతోంది.డిసెంబర్ చివరి వారంలో లేదా జనవరి తొలి వారంలో పోలింగ్ జరిగే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఎన్నికల సంఘం అధికారిక షెడ్యూల్ ప్రకటించలేదు. ఓటరు జాబితాలు, ఇతర పరిపాలనా ఏర్పాట్లు పూర్తయిన తర్వాతే ఎన్నికల ప్రక్రియపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. షెడ్యూల్ విడుదలైతే పల్లె నుంచి నగరం వరకు రాజకీయ వాతావరణం మరింత వేడెక్కడం ఖాయంగా కనిపిస్తోంది.ఎన్నికల నగారా ఎప్పుడు మోగుతుంది.. అభ్యర్థుల భవితవ్యం ఏమిటి.. ప్రజలు ఎవరికి పట్టం కడతారు.. అన్న ఉత్కంఠ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో నెలకొంది.

పోలీస్ కొలువులకు గ్రీన్ సిగ్నల్.!

- 2 వేల హోంగార్డు పోస్టుల భర్తీకి రంగం సిద్ధం
- త్వరలోనే నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు
- నియామకాలపై డీజీపీ సీవీ ఆనంద్ కీలక సమీక్ష
- పోలీస్ శాఖలో మంజూరైన సిబ్బంది సంఖ్యపై పునఃసమీక్ష
- అధికారులకు బాధ్యతలు.. పనుల పూర్తికి గడువులు

2 లో



సీఎంఆర్ అక్రమాలపై ఈడీ గురి

- మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్ నివాసం, రైస్ మిల్లులో సోదాలు
- రూ.40.96 కోట్ల విలువైన ధాన్యం మళ్లింపుపై దర్యాప్తు
- 9,639 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగింతలో అవకతవకల ఆరోపణలు
- ఖానాపూర్, హైదరాబాద్ నివాసాలతో పాటు సత్తెనపల్లిలోని మిల్లులో తనిఖీలు
- తెల్లవారుజాము నుంచే రంగంలోకి దిగిన ఈడీ, విజిలెన్స్ బృందాలు
- మనీ లాండరింగ్ కోణంలో ఆర్థిక లావాదేవీలపై ఆరా
- డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లకు ప్రభుత్వ చర్యలు ముమ్మరం



ప్రజా వాయిస్ ప్రతినిధి, నిర్మల్ :కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం అక్రమాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ప్రభుత్వానికి అప్పగించాల్సిన ధాన్యాన్ని పక్కదారి పట్టించారనే ఆరోపణల నేపథ్యంలో ఖానాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్‌కు సంబంధించిన నివాసాలు, రైస్ మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఖానాపూర్, హైదరాబాద్‌లోని నివాసాలతో పాటు సత్తెనపల్లిలోని ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో ఏకకాలంలో సోదాలు చేపట్టడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

రూ.40.96 కోట్ల ధాన్యం మళ్లింపుపై విచారణ

గతంలో మూడు సీజన్లకు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన సుమారు 9,639 మెట్రిక్ టన్నుల

మిగతా 2లో

యోగి ఆదిత్యనాథ్‌కు మాతృవియోగం

- తల్లి సావిత్రి దేవి కన్నుమూత
- 91 ఏళ్ల వయసులో తుదిశ్వాస
- ఉత్తరాఖండ్‌లోని స్వగ్రామంలో విషాదం



ప్రజా వాయిస్, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి సావిత్రి దేవి (91) శుక్రవారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యం, వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ ఉత్తరాఖండ్‌లోని పౌరీ గఢ్వాల్ జిల్లా యమకేశ్వర్ బ్లాక్ పరిధిలోని స్వగ్రామం పంచూర్‌లో తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్తను యోగి ఆదిత్యనాథ్ సోదరుడు మహేంద్ర ధ్రువీకరించారు. సావిత్రి దేవి మృతితో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాజకీయ వర్గాల్లో విషాదం అలముకుంది. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆమె మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మాతృమూర్తి ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులు జీవితంలో వెలకట్టలేని సంపదని, తల్లిని కోల్పోవడం ఏ కుటుంబానికైనా తీరని లోటని పేర్కొన్నారు.

సిద్దిపేటలో తేల్చుకుందాం.. దమ్ముంటే రండి.!

- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ సవాల్
- కొడంగల్ లో కాదు.. దమ్ముంటే సిద్దిపేటలో నాపై పోటీ చేయండి
- సీఎం ప్రసంగమంతా బీఆర్ఎస్ నేతల నామస్మరణే
- కేసీఆర్ పేరు 63 సార్లు.. హరీశ్ పేరు 53 సార్లు.. కేటీఆర్ పేరు 24 సార్లు
- ప్రజా సమస్యలు, హామీల అమలుపై మాట్లాడే ధైర్యం లేదని విమర్శ?



ప్రజా వాయిస్,హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సూటి సవాల్ విసిరారు. కొడంగల్‌లో కాకుండా దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ చేశారు. సిద్దిపేట సభలో సీఎం చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన ఆయన.. ముఖ్యమంత్రి ప్రసంగం మొత్తం బీఆర్ఎస్ నేతల చుట్టూనే తిరిగిందని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి, ఎన్నికల హామీల అమలుపై మాట్లాడకుండా ప్రతిపక్ష నేతల పేర్లను ప్రస్తావించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

ప్రసంగంలో పేర్ల పల్లవి

శుక్రవారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు.. సీఎం ప్రసంగంలోని ప్రస్తావనలను లెక్కలతో సహా బయటపెట్టారు. కేసీఆర్ పేరు 63 సార్లు, తన పేరు 53 సార్లు, కేటీఆర్ పేరు 24 సార్లు ప్రస్తావించారని తెలిపారు. ఈ లెక్కలే ముఖ్యమంత్రి ప్రసంగం ఏ అంశాల చుట్టూ సాగిందో చెబుతున్నాయని

మిగతా 2లో

అధికారం శాశ్వతం కాదు.. అహంకారం తగదు

- ఉన్నత పదవుల్లో ఉన్న నేతలు హుందాగా వ్యవహరించాలి.
- అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు క్షమించరు
- ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పాలకుల తీరుపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు



ప్రజా వాయిస్,హైదరాబాద్. అధికారం ఉందని అహంకారంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజలు హర్షించరని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఉన్నత పదవుల్లో ఉన్న ముఖ్య నేతలు హుందాగా మాట్లాడాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అప్రజా స్వామికంగా వ్యవహరించడం, విచ్చలవిడిగా అవినీతికి పాల్పడటం, ప్రజల అవసరాలను విస్మరించి దుర్మార్గపు పాలన సాగించడం వంటి చర్యలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా చేసిన పోస్టు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ధర్మబద్ధంగా, నిజాయితీగా పాలన సాగించేలా పాలకులకు సద్బుద్ధి ప్రసాదించాలని అయ్యప్ప స్వామిని ప్రార్థించారు. పాలకులు ఆత్మపరిశీలన చేసుకుని ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా జ్ఞానాన్ని ప్రసాదించాలని కోరుతూ 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ తన సందేశాన్ని ముగించారు.

ఆదాయం మాది.. అధికారం ఉత్తరాదిదా.?

మొదటి పేజీ తరువాయి

సర్కారు బడుల్లో సరికొత్త సంస్కరణలు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా సంస్కరణలు చేపట్టామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లోనే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. దీంతో విద్యార్థుల హాజరు పెరిగిందన్నారు. పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్ కళాశాలలు దూరంగా ఉండటంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్న పరిస్థితిని అధిగమించేందుకు ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్య పరిధిలోకి తీసుకువచ్చే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఐటీఐలకు ఆధునిక సాంకేతిక హంగులు

విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సీఎం పేర్కొన్నారు. ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. పాతకాలపు కోర్సులకు స్వస్తి పలుకుతూ ఐటీఐలను ఆధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ప్రపంచస్థాయి విద్యను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

మెస్సీ తర్వాత రొనాల్డోకు రెడ్ కార్పెట్

తెలంగాణకు క్రీడారంగంలో అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సీఎం తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇస్తోందని, ఇందులో 8 వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని ఇప్పటికే తెలంగాణకు తీసుకువచ్చామని, పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కూడా రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. మెస్సీ తన అభిమాన ఆటగాడని, గతంలో డిగో మారడోనా కూడా తన అభిమాన ఫుట్‌బాలర్ అని సీఎం పేర్కొన్నారు.



సీఎంఆర్ అక్రమాలపై ఈడీ గురి

మొదటి పేజీ తరువాయి

సీఎంఆర్ ధాన్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ధాన్యం విలువ సుమారు రూ.40.96 కోట్లుగా పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంలో ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్ యాజమాన్యంపై ఇప్పటికే కేసులు నమోదైనట్లు సమాచారం. ధాన్యం మళ్లింపు వెనుక భారీ ఆర్థిక లావాదేవీలు జరిగాయా? మనీ లాండరింగ్‌కు సంబంధం ఉందా? అనే కోణాల్లో ఈడీ అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.

ఏకకాలంలో పలు ప్రాంతాల్లో సోదాలు

తనిఖీల్లో భాగంగా ఖానాపూర్‌లోని మాజీ ఎమ్మెల్యే నివాసంతో పాటు హైదరాబాద్‌లోని నివాసం, సత్తెనపల్లిలోని రైస్ మిల్లులో అధికారులు పలు రికార్డులను పరిశీలించారు. ధాన్యం కేటాయింపులు, బియ్యం అప్పగింతలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేసినట్లు సమాచారం. సోదాల సమయంలో నివాసాల పరిసరాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా తదుపరి విచారణ కొనసాగించే అవకాశం ఉంది.

డిఫాల్టర్ మిల్లర్లపై ప్రభుత్వ నిఘా

మరోవైపు నిర్మల్ జిల్లాలో సీఎంఆర్ ధాన్యం అక్రమాలపై ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేసింది. ఇప్పటికే పలు రైస్ మిల్లులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన మిల్లులపై కేసులు నమోదు చేయడంతో పాటు అక్రమాలు గుర్తించిన చోట చర్యలు చేపట్టారు.

బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు

ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని నిర్ణీత గడువులోగా బియ్యం అప్పగించని మిల్లర్ల నుంచి బకాయిలను రికవరీ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ధాన్యం నిల్వలు, బియ్యం అప్పగింతలు, మిల్లుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అక్రమాలకు పాల్పడినట్లు తేలితే సంబంధిత మిల్లుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

తాజా సోదాలతో మిల్లర్లలో కలవరం

సీఎంఆర్ ధాన్యం మళ్లింపు వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన నివాసాలు, రైస్ మిల్లుపై ఈడీ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టడం జిల్లాలో తీవ్ర చర్చకు దారితీసింది. ఇప్పటికే బకాయిలు చెల్లించకుండా ఉన్న ఇతర మిల్లర్ల వ్యవహారాలపైనా అధికారులు దృష్టి సారించే అవకాశముంది. తాజా సోదాల్లో ఎలాంటి ఆధారాలు లభించాయి? దర్యాప్తులో మరిన్ని పేర్లు వెలుగులోకి వస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది.



డేటింగ్ యాప్‌లో డేంజర్ గేమ్.!

ప్రజా వాయిస్,హైదరాబాద్: చేతిలో స్మార్ట్‌ఫోన్.. డేటింగ్ యాప్‌లో అందమైన యువకుడి ఫొటో.. పరిచయం పేరుతో పలకరింపు.. ఆపై స్నేహం ముసుగులో నమ్మకం సంపాదించడం ఇదంతా నిజమైన స్నేహం కోసం కాదు.. పక్కా దోపిడీకి వేసిన ఎత్తుగడ ఆన్‌లైన్ పరిచయాలను ఆసరాగా చేసుకుని అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్న ఓ దోపిడీ ముఠా బాగోతం హైదరాబాద్‌లో వెలుగుచూసింది. గ్రిండర్ వంటి డేటింగ్, ఫ్రెండ్షిప్ యాప్‌ల ద్వారా ప్రధానంగా ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీ సభ్యులకు వల విసిరి, మత్తుమందు ఇచ్చి దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు.

ఫేక్ ప్రొఫైల్స్ తో పరిచయం.. వీడియో కాల్స్ తో నిఘా

ముఠా సభ్యులు అందమైన యువకుల పేర్లతో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించేవారు. యాప్‌లలో బాధితులకు పరిచయమై చాటింగ్, వీడియో కాల్స్‌తో నమ్మకం కల్పించేవారు. ఈ క్రమంలో బాధితుల ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను గమనించి తమ తదుపరి లక్ష్యంగా ఎంచుకునేవారు. అనంతరం ఏకాంతంగా కలుద్దామంటూ ప్రైవేట్ గదులకు ఆహ్వానించేవారు.

బీరులో మత్తుమందు.. ఆపై దోపిడీ

బాధితులు గదులకు చేరుకున్నాక బీర్లలో మత్తుమందు కలిపి ఇచ్చేవారు. వారు స్పృహ కోల్పోయిన వెంటనే ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్లు, నగదును దోచుకుని పరారయ్యేవారు. బాధితులు తేరుకునే లోపే నిందితులు అక్కడి నుంచి మాయమయ్యేవారు. ఇలా గత ఏడాది కాలంలో 20కి పైగా దోపిడీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

డాక్టర్ సలహాలతో మత్తు ప్రయోగం

ఈ నేరాలకు ఆరిఫ్ సూత్రధారిగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. కర్నూలుకు చెందిన డాక్టర్ దినేష్ రెడ్డి మత్తుమందుల మోతాదుల విషయంలో సాంకేతిక సలహాలు అందించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పక్కా ప్రణాళికతో బాధితులను ఎంపిక చేసుకుని దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

36 తులాల బంగారం స్వాధీనం

వరుస దోపిడీలపై దృష్టి సారించిన మల్కాజిగిరి పోలీసులు ముఠా గుట్టు రట్టు చేశారు. ఐదుగురు ప్రధాన నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 36 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా మరిన్ని నేరాలకు పాల్పడిందా? ఇంకెవరైనా సహకరించారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పరిచయం ఎవరిదైనా..అప్రమత్తత అవసరం

డేటింగ్, ఫ్రెండ్షిప్ యాప్‌లలో పరిచయమయ్యే అపరిచితులను గుడ్డిగా నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు. వ్యక్తిగత వివరాలు పంచుకోవడం, ఏకాంత ప్రదేశాల్లో కలవడం, అపరిచితులు ఇచ్చే ఆహార పానీయాలు స్వీకరించడం వంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. స్నేహం ముసుగులో సాగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

పోలీస్ కొలువులకు గ్రీన్ సిగ్నల్.!

ప్రజా వాయిస్,హైదరాబాద్: పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తీపికబురు! తెలంగాణలో 2 వేల హోంగార్డు పోస్టుల భర్తీకి పోలీస్ శాఖ కసరత్తు వేగవంతం చేసింది. త్వరలోనే నియామక నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు నియామక ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలు, కార్యాచరణపై డీజీపీ సీవీ ఆనంద్ ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పోస్టుల భర్తీకి సంబంధించి శాఖాపరమైన ఏర్పాట్లను సిద్ధం చేయడంపై దృష్టి సారించారు.

నియామకాలపై కసరత్తు..నిరుద్యోగుల్లో ఆశలు

రాష్ట్రంలో పోలీస్ శాఖ ప్రస్తుత అవసరాలు, సిబ్బంది కొరత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హోంగార్డు పోస్టుల భర్తీకి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన మినీ స్టాఫ్ ఆఫీసర్స్ సమావేశంలో హోంగార్డు నియామక నోటిఫికేషన్, వార్షిక శిక్షణ క్యాలెండర్ రూపకల్పన తదితర అంశాలపై చర్చించారు. 2 వేల పోస్టుల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలపై అధికారులతో సమాలోచనలు జరిపారు. దీంతో నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

సిబ్బంది సంఖ్యపై పునఃసమీక్ష

ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో మంజూరైన సిబ్బంది సంఖ్యను పునఃసమీక్షించే అంశాన్ని కూడా సమావేశంలో పరిశీలించారు. పోలీస్ శాఖలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, సిబ్బంది సంక్షేమం, పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో ప్రస్తావించిన ప్రతి అంశానికి అధికారులకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించడంతోపాటు, పనుల పూర్తికి గడువులు నిర్ణయించారు. నిర్దేశిత సమయంలో లక్ష్యాలను పూర్తి చేయాలని డీజీపీ ఆదేశించారు.

పోలీస్ రిట్రీట్..మహిళా అధికారుల సదస్సు

వచ్చే నెలలో నిర్వహించనున్న పోలీస్ రిట్రీట్, మహిళా పోలీస్ అధికారుల సదస్సు నిర్వహణపైనా సమీక్షించారు. నూతన తెలంగాణ పోలీస్ మాన్యువల్ రూపకల్పన పూర్తి చేసి విడుదల చేయడం, పోలీస్ బ్రాస్, పైప్ బ్యాండ్ల పునరుద్ధరణ, రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్ నిర్వహణ, ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాట్లపై చర్చించారు. పోలీస్ శాఖను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై డీజీపీ దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో డీజీ విమెన్ సేఫ్టీ వింగ్ సౌమ్య మిశ్రా, టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్తు, డీజీ ఏసీబీ అండ్ సీఐడీ చారు సిన్హా, టీజీఎస్పీ ఏడీజీ సంజయ్ కుమార్ జైన్, ఏడీజీ (లా అండ్ ఆర్డర్) అకున్ సబర్వాల్, ఐజీ పీ అండ్ ఎల్ గజరావ్ భూపాల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో తేల్చుకుందాం.. దమ్ముంటే రండి.!

మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. సిద్దిపేట సభకు వచ్చిన ముఖ్యమంత్రి ప్రజల సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడాల్సింది పోయి బీఆర్ఎస్ నేతల పేర్లనే పదేపదే ప్రస్తావించడంపై విమర్శలు గుప్పించారు.

హామీలపై ప్రశ్నిస్తే విమర్శలా.?

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. హామీల అమలుపై ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పకుండా దృష్టి మళ్లించేందుకు ముఖ్యమంత్రి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యతను విస్మరించి రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.

సిద్దిపేటే వేదికగా సవాల్

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు రాజకీయంగా గట్టి సమాధానం ఇచ్చిన హరీశ్‌రావు.. కొడంగల్ వేదికగా కాకుండా సిద్దిపేటకు వచ్చి తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలతో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ వేడి మరింత పెరిగింది. సీఎం ప్రసంగంపై హరీశ్ చేసిన విమర్శలు, విసిరిన సవాల్ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ఉద్యోగాల ఆశలు.. కాలుష్య భయాలు

- వీర్లపాలెం ఇథనాల్ పరిశ్రమపై భిన్న స్వరాలు
- ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమకు పలువురి మద్దతు
- స్థానిక యువతకు ఉపాధి, గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే పట్టుబాటు
- రైతులకు అన్యాయం జరిగితే సహించబోమని బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ హెచ్చరిక
- ప్రజాభిప్రాయ సేకరణ బోగస్.. రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ప్రజాసంఘాల డిమాండ్
- ముందస్తు నిర్బంధాలు, మాట్లాడే అవకాశం నిరాకరణపై పిటిషనర్ల ఆరోపణలు
- అభివృద్ధితో పాటు ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణే అసలైన సవాల్





ప్రజా వాయిస్ బ్యూరో, ఉమ్మడి నల్గొండ. ఒకవైపు పరిశ్రమ వస్తే తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయనే ఆశ.. మరోవైపు పరిశ్రమతో పర్యావరణం దెబ్బతిని తమ పంట పొలాలు, నీటి వనరులు, ఆరోగ్యాలు ప్రమాదంలో పడతాయేమోననే ఆందోళన.. అభివృద్ధి కావాలనే ఆకాంక్షకు, జీవన భద్రత కావాలనే ఆవేదనకు వేదికగా మారింది నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో జరిగిన సోహం ఇథనాల్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణ. శుక్రవారం మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో హాజరైన వారిలో పలువురు పరిశ్రమ ఏర్పాటుకు మద్దతు తెలుపుతూ పెట్టుబడులు, ఉద్యోగాలు, స్థానిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరగా, మరికొందరు కాలుష్యం, నీటి వినియోగం, ప్రజారోగ్యంపై ఆందోళనలు వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన తీరుపై ప్రజాసంఘాలు, హైకోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ కార్యక్రమం వివాదాస్పదంగా మారింది.

ఉపాధి అవకాశాలపై స్థానికుల ఆశలు

ప్రతిపాదిత ఇథనాల్ పరిశ్రమతో ప్రాంతానికి పెట్టుబడులు రావడంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పరిశ్రమకు మద్దతు తెలిపిన పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటైతే ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని, స్థానిక రైతులకు కూడా పరోక్షంగా ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని స్పష్టం చేశారు.

హామీలు అమలు చేయకపోతే ఊరుకోము: ఎమ్మెల్యే బత్తుల, ఎమ్మెల్సీ శంకర్ నాయక్.

ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరైన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) పరిశ్రమ యాజమాన్యానికి పలు సూచనలు చేస్తూనే హెచ్చరికలు జారీ చేశారు. గతంలో దామరచర్ల మండలంలో అనేక పరిశ్రమలు ఏర్పాటైనా స్థానిక ప్రజలకు ఆశించిన స్థాయిలో న్యాయం జరగలేదని పేర్కొన్నారు. యాదాద్రి విద్యుత్ ప్లాంట్ కోసం పేద రైతులు భూములు ఇచ్చి, ఇప్పటికీ తమ సమస్యల పరిష్కారం కోసం తిరుగుతున్నారని గుర్తుచేశారు. గత పాలకుల హయాంలో ఉద్యోగాలు, పరిహారం, ఇతర హామీల విషయంలో రైతులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. తన హయాంలో అలాంటి పరిస్థితులు పునరావృతం కావడానికి అనుమతించబోనని స్పష్టం చేశారు.భూముల కొనుగోలు నుంచి ఉద్యోగాల కల్పన వరకు ప్రతి అంశం పారదర్శకంగా ఉండాలని, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని, సీఎస్ఆర్ నిధులు నేరుగా ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధికి పరిశ్రమ బాధ్యత తీసుకోవాలని, ప్రజలు తమ అవసరాల కోసం నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలను సైతం కలుపుకొని అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కూడా పరిశ్రమ ఏర్పాటుకు మద్దతు తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణపై ప్రజాసంఘాల అభ్యంతరం

మరోవైపు ఈ ప్రజాభిప్రాయ సేకరణ ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదని ప్రజాసంఘాలు ఆరోపించాయి. గ్రామస్థులకు, ప్రజాసంఘాల ప్రతినిధులకు మాట్లాడే అవకాశం కల్పించలేదని, వీర్లపాలెం గ్రామానికి చెందిన ఆరుగురు యువకులను ముందస్తుగా అరెస్టు చేసి సమావేశానికి రాకుండా అడ్డుకున్నారని విమర్శించాయి. మాట్లాడేందుకు ముందుగానే పేర్లు నమోదు చేసుకున్న ప్రజాసంఘాల ప్రతినిధులకు కూడా అవకాశం ఇవ్వలేదని ఆరోపించాయి. కంపెనీకి అనుకూలంగా మాత్రమే అభిప్రాయాలు నమోదు చేసేలా కార్యక్రమం నిర్వహించారని పేర్కొన్నాయి.ఇథనాల్ పరిశ్రమ వల్ల వాయు, జల కాలుష్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, భారీగా నీటి వినియోగం వల్ల స్థానిక నీటి వనరులపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలోని అంశాలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించలేదని విమర్శించాయి. ఈ నేపథ్యంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణను బోగస్‌గా అభివర్ణిస్తూ రద్దు చేయాలని, ముందస్తు నిర్బంధాలు లేకుండా ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం కల్పిస్తూ మరోసారి నిర్వహించాలని డిమాండ్ చేశాయి.

హైకోర్టును ఆశ్రయించిన ఏడుగురు పిటిషనర్లు

ప్రజాభిప్రాయ సేకరణకు స్టే ఇవ్వాలని కోరుతూ వీర్లపాలెం గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ (WP No.39207 of 2026) దాఖలు చేశారు. నవంబర్ 19న జస్టిస్ బి. విజయన్ రెడ్డి, జస్టిస్ గడి ప్రవీణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొన్న ధర్మాసనం, పిటిషనర్లు నవంబర్ 12, 13 తేదీల్లో సమర్పించిన అభ్యంతరాలను పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులకు పంపించి, చట్టప్రకారం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలన్న కాలుష్య నియంత్రణ మండలి తరఫు న్యాయవాది విజ్ఞప్తిని నమోదు చేస్తూ పిటిషన్‌ను పరిష్కరించింది.అయితే ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇద్దరు పిటిషనర్లకు తమ అభ్యంతరాలు వెల్లడించే అవకాశం కల్పించలేదని, కొందరు స్థానికులను పోలీసులు ముందస్తుగా నిర్బంధించారని పిటిషనర్లు ఆరోపించారు. ఈ నిర్బంధాలపై విచారణ జరిపి, అందరికీ స్వేచ్ఛగా అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కల్పిస్తూ మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రజల గొంతుక వినాలంటున్న నాయకులు

రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ కన్నెగంటి రవి, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో–కన్వీనర్ కే. రవిచంద్ర, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, హెచ్ఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరస్వామి, సంజీవ్, వెంకటరమణ, జనసమితి నాయకుడు నాగేశ్వరరావు, ప్రజాసంఘాల ఐక్యవేదికకు చెందిన బి. రామయ్య, కిరణ్మయి, రమణారెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకుడు సుదర్శన్ తదితరులు ప్రజాభిప్రాయ సేకరణ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా పరిశ్రమలకు అనుమతులు ఇవ్వవద్దని ప్రభుత్వాన్ని కోరారు.

అభివృద్ధి ఎవరి కోసం..

భారం ఎవరి మీదవీర్లపాలెం ప్రజాభిప్రాయ సేకరణ మరోసారి ఒక కీలక ప్రశ్నను ముందుకు తెచ్చింది. పరిశ్రమల ద్వారా పెట్టుబడులు, ఉద్యోగాలు, అభివృద్ధి రావడం ఎంత ముఖ్యమో.. ఆ అభివృద్ధి కోసం స్థానిక ప్రజలు తమ ఆరోగ్యాన్ని, నీటి వనరులను, వ్యవసాయ భూములను పణంగా పెట్టాల్సిన పరిస్థితి రాకుండా చూడడం కూడా అంతే ముఖ్యం. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత ఆశలు, భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతుల భద్రత, భవిష్యత్ తరాల ఆరోగ్యం అన్నీ సమానంగా ప్రాధాన్యత పొందాలి. పరిశ్రమ ఏర్పాటుపై అనుకూల, వ్యతిరేక అభిప్రాయాలను మాత్రమే కాకుండా ప్రజాభిప్రాయ సేకరణ పారదర్శకతపై వచ్చిన ఆరోపణలను కూడా అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. పరిశ్రమ వస్తుందా స్థానికులకు ఎంతమేర ప్రయోజనం కలుగుతుంది..పర్యావరణానికి భద్రత ఉంటుందా..ప్రజల అభ్యంతరాలకు పరిష్కారం లభిస్తుందా..అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు ఇచ్చే సమాధానాలపైనే వీర్లపాలెం భవిష్యత్తు ఆధారపడి ఉంది.



రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుంది!

- కొడంగల్ లో రాజకీయంగా ఎదురుగాలి వీస్తోందనే కేసీఆర్ కుటుంబంపై విమర్శలు
- ప్రజా సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యం
- సీఎంపై మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి వ్యాఖ్యలు

ప్రజావాయిస్ /వికారాబాద్ బ్యూరో: కొడంగల్‌లో రాజకీయంగా ఓటమి భయం పట్టుకోవడంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల, సిద్దిపేట సభల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..సిద్దిపేట సభలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రయోజనాలు, అర్హతలను వివరించాల్సింది పోయి, బీఆర్ఎస్ నేతలను విమర్శించడానికే ఎక్కువ సమయం కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడే భాష హుందాగా ఉండాలని హితవు పలికారు.రాష్ట్రంలో ప్రజాభిప్రాయం బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతోందన్న అసహనంతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు. కొడంగల్‌లో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో రైతు గర్జన పేరుతో మూడు రోజుల పాటు సభలు నిర్వహించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు.కొడంగల్ ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించడంతో పాటు రైతుల సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో విఫలమై రాజకీయ విమర్శలతో కాలం వెళ్లదీయడం మానుకోవాలని సూచించారు. ప్రజలకు కావాల్సింది తిట్ల రాజకీయాలు కాదని, అభివృద్ధి, ఉపాధి, సాగునీరు, తాగునీరు, రైతులకు భరోసా అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి తగిన రాజకీయ సమాధానం చెబుతారని పట్నం నరేందర్ రెడ్డి హెచ్చరించారు.

ప్రజాధనం పై భద్రత ఏది!?

- పంచాయతీ నిధులు స్వాహా పై విచారణ మేనమేగాలేనా?
- ఎంపీడీవో అధికారికి ఫిర్యాదు చేసిన స్పందన కరువా!?
- అధికార పార్టీ నాయకులపై చర్యలు శూన్యమా!?
- నిధులు మింగేసిన నిందతుడుపై విచారణ చేసే ధైర్యం లేదా!?
- ఉప సర్పంచ్ ఫిర్యాదు ఆలస్యానికి కారణం ఏమిటి!?
- జిల్లా యంత్రాంగానికి తెలిసి మౌనం వహిస్తున్నారా!?
- ఓట్ల పల్లి పంచాయితీ నిధులపై తేలని ఉత్కంఠం!?





ప్రజా వాయిస్ అశ్వారావుపేట రాష్ట్రంలో సగటు మనిషి స్వార్థం గానే ఆలోచిస్తున్నాడు. తన సొంత సంపాదనైతే ఒక తీరు ప్రభుత్వ ఆస్తులు అంటే మరో తీరుగా చూడటమే కాకుండా అనేక సందర్భాల్లో వ్యత్యాసం కూడా ప్రదర్శిస్తుంటారు ప్రజాధనం అంటే కొందరు మింగేయాలని మరికొందరు కాపాడాలని మరికొందరు నాకెందుకులే అంటూ ధీమా వ్యక్తం చేయటం అనేక సందర్భంలో అనేక సంఘటనలో మనకు సంఘటనలు దర్శనమిస్తూనే ఉంటాయి ఓ ప్రజా ప్రతినిధి ప్రజాధనాన్ని దొంగిలించాడని పంచాయితీ ఉపసర్పంచ్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే స్పందించాల్సిన అధికార యంత్రాంగం మేనమేగాలను లెక్కిస్తూ స్పందించే పరిస్థితి కనిపించడం లేదు అధికార పార్టీ నాయకుడు పై చర్యలు తీసుకోవటానికి అధికారులు సైతం మౌనవహించడమే తప్ప విచారణకు ఆదేశాలు జారీ చేసే ధైర్యం కూడా లేకుండా పోతుంది ఫిర్యాదు ఆలస్యానికి గల కారణం ఏమిటని ప్రజానీకం సైతం ప్రశ్నిస్తున్న జిల్లా యంత్రాంగానికి తెలిసినా మౌనం వహించడం వెనక అంతర్గత రహస్యం ఏమిటో నేటికీ అంతుపట్ట లేకుండా పోతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావు పేట మండలంలోని ఓట్లపల్లి పంచాయతీలో ఓ సర్పంచ్ ప్రజాధనాన్ని దుర్వినియోగం పరుస్తూ సంబంధం లేని పంచాయితీకి నిధులను వినియోగించి వారు మెప్పు కొరకు ప్రయత్నించడమే కాకుండా నిధులు స్వాహా చేసిన సంఘటనపై ఓట్లపల్లి ఉపసర్పంచ్ స్థానిక ఎంపీడీవో కి ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా నేటికీ విచారణ చేయటంలో మౌనం వహిస్తున్నారని గ్రామాల్లో భారీగా ప్రచారం కొనసాగుతుంది అంతేకాకుండా అట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన సంఘటనపై ప్రజా వాయిస్ దినపత్రిక నవంబర్ 12 వ తారీకు పంచాయితీలో డిశుం డిష్యుం! అనే శీర్షికను ప్రచురించినప్పటికీ స్పందన కరువైందని తేటతెల్లమవుతుంది నిజానికి ఒక్క పంచాయతీలో ప్రజాధనాన్ని కాజేసేందుకు ఒక సర్పంచ్ రహస్యంగా పంచాయతీ కార్యదర్శి ద్వారా నిధులను దుర్వినియోగం పరుస్తా ఉంటే అట్టే విషయాన్ని ఉపసర్పంచ్ ధైర్యం చేసి పంచాయతీ నిధులను దుర్యోగం పరుస్తారా అంటూ అట్టి విషయాన్ని స్థానిక ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లి ఫిర్యాదు చేసినప్పటికీ నేటికీ అట్టి ఫిర్యాదు పై దర్యాప్ చేసిన దాఖలాలు ఇవ్వని ఓట్లపల్లి గ్రామస్తులు అధికారులు తీప్రంగా విమర్శిస్తున్నారు. అసలు పంచాయతీలో నిధులు దుర్యోగం జరిగాయా! కావాలని ఉప సర్పంచ్ ఫిర్యాదు చేశాడా! ప్రజా వాయిస్ కథనం లో నిజం ఎంత? అదే పంచాయతీ సర్పంచ్ ఉప సర్పంచ్ పై తిరిగి మరల ఎందుకు ఫిర్యాదు చేయడం జరిగింది?. అసలు పంచాయితీలో ఏం జరుగుతుంది.? ఇరువురు మధ్య కొట్లాటకు దారి తీసిన సంఘటన ఏమిటి? అంత వరకు తీసుకు రావడానికి ప్రధాన అంశాలు ఏమిటి? అధికారులు సైతం మౌనం ఎందుకు వహిస్తున్నారు. విచారణకు ఆదేశాలు ఎందుకు జరగటం లేదు! వంటి ప్రశ్నలకు సమాధానం చెప్పవలసిన జిల్లా యంత్రాంగం ఎందుకు మౌనం వహిస్తుంది పత్రికా కథనాలలో నిజం లేదా స్పందించాల్సిన వారు జాడ ఎక్కడ అంటూ ప్రజానీకం సైతం ప్రశ్నించే స్థాయికి చేరుకుంటుందని సీనియర్ సిటిజన్లో సైతం అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి డిపిఓ కి ఆదేశాలు జారీ చేయాలని అలాగే పంచాయతీలో నిజంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం పరిచిన సర్పంచ్ ఫిర్యాదు చేసిన ఉపసర్పంచ్ పై విచారణ కొనసాగించాలని ఓట్లపల్లి గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



పంచాయతీలో డిశుం డిశుం!?

ఏరియా ఆసుపత్రిలో రోగుల ఆరోగ్య స్థితిగతులపై సూపరింటెండెంట్ ఆరా

- ట్రైనీ విద్యార్థులకు విలువైన సూచనలు సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్

ప్రజా వాయిస్/ బెల్లంపల్లి టౌన్ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించిన ఆయన, చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య బాగోగులను తెలుసుకున్నారు.ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీ, భోజన వసతి, పారిశుద్ధ్య నిర్వహణపై రోగులను అడిగి వివరాలు సేకరించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు.

శిక్షణ విద్యార్థులకు కీలక సూచనలు:

అనంతరం ఆసుపత్రిలో నర్సింగ్ మరియు మెడికల్ ట్రైనింగ్ పొందుతున్న విద్యార్థులతో డాక్టర్ రవికుమార్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, శిక్షణ సమయంలోనే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకోవాలని సూచించారు. రోగులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, ఓపికతో సేవలు అందించే విధానంపై వారికి అవగాహన కల్పించారు.





కొండగట్టు ఆంజనేయస్వామి చందనోత్సవానికి హాజరైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్

ప్రజా వాయిస్, చొప్పదండి (నవంబర్ 20): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామివారి చందనోత్సవం, పశు సంప్రోక్షణ, నిజరూప దర్శన మహోత్సవ వేడుకలకు తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు.శుక్రవారం ఆలయానికి చేరుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వారు స్వామివారి చందనోత్సవం, నిజరూప దర్శన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన జిల్లా, మండల స్థాయి నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బంగారం ధరలు తగ్గడంతో కొనుగోళ్లకు మొగ్గు!

- పెళ్లిళ్ల సీజన్ కోసం ఇప్పుడే పసిడి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న గ్రామీణ ప్రజలు
- బంగారం ధరలు తగ్గడంతో మహిళల్లో ఆనందం
- వచ్చే మాఘ మాసంలో పెళ్లిళ్లకు ఇప్పటి నుంచే కొనుగోళ్లు
- ధరలు ఇంకా తగ్గుతాయా.. పెరుగుతాయా అంటూ చర్చలు

పెన్ పహాడ్ ప్రజా వాయిస్: బంగారం ధరలు తగ్గుముఖం పట్టడంతో గ్రామాల్లో పసిడి కొనుగోళ్ల సందడి మొదలైంది. ఇటీవల బంగారం ధరలు తగ్గడంతో చాలామంది మహిళలు, కుటుంబాలు బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా వచ్చే మాఘ మాసంలో పెళ్లిళ్లు ఉండటంతో ముందుగానే బంగారం కొనుగోలు చేసేందుకు దుకాణాల వైపు మొగ్గు చూపుతున్నారు.పెళ్లిళ్లలో బంగారు ఆభరణాలకు ఎంతో ప్రాధాన్యత ఉండటంతో, ధరలు తగ్గిన సమయంలో కొనుగోలు చేస్తే కొంత మేలు జరుగుతుందని గ్రామీణ ప్రజలు భావిస్తున్నారు. తులం ధర తగ్గిందన్న వార్త తెలియడంతో తమ పిల్లల పెళ్లిళ్లు, కుటుంబ అవసరాల కోసం బంగారం కొనాలని అనుకునే వారు ఆరా తీస్తున్నారు.మరోవైపు బంగారం ధరలు మళ్లీ పెరుగుతాయేమోనన్న ఆందోళనతో కొందరు ఇప్పుడే కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇంకొందరు ధరలు మరింత తగ్గుతాయేమోనని వేచి చూస్తున్నారు. దీంతో గ్రామాల్లో బంగారం ధరలపై చర్చ జోరుగా సాగుతోంది.వచ్చే మాఘ మాసంలో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండటంతో బంగారం కొనుగోళ్లకు మరింత ఊపు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ధరలు తగ్గిన ఈ సమయంలో పసిడి కొనుగోళ్లు పెరుగుతాయా అన్నది చూడాలి.



యునివర్సిటీ విధ్వంసానికి పాల్పడిన వారికి అండగా ఉంటారా..?

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై బీఆర్ఎస్వీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ ప్రశ్నల వర్షం
- చెట్ల నరికివేత, మట్టి తరలింపుపై మౌనం ఎందుకు.?
- విద్యార్థుల భవిష్యత్తుకు బాసటగా నిలుస్తారా లేదా..
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్







ప్రజా వాయిస్,కరీంనగర్ (నవంబర్ 20): విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడుతున్న నాయకులకు సంఘీభావం తెలిపే ఎమ్మెల్యేలు.. అదే విద్యార్థులు చదువుకుంటున్న యూనివర్సిటీ విధ్వంసానికి గురవుతుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారని శాతవాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బాసటగా నిలుస్తారా..? లేక యూనివర్సిటీ సహజ వాతావరణాన్ని ధ్వంసం చేస్తున్న వ్యక్తులకు అండగా నిలుస్తారా..? అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యాన్ని నిలదీశారు. యూనివర్సిటీలో మిగిలిన సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ గత ఐదు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జేఏసీ విద్యార్థి నాయకులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సంఘీభావం తెలిపారు. అయితే యూనివర్సిటీలో పెద్దఎత్తున చెట్ల నరికివేత, లోతైన గుంతలు తవ్వి మట్టి తరలింపు వంటి చర్యలతో పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణం ధ్వంసమవుతున్నా ఎమ్మెల్యే ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. యూనివర్సిటీ మెయిన్ గేట్ నుంచి లోపలికి వెళ్లి అక్కడ జరుగుతున్న విధ్వంసాన్ని పరిశీలించే సమయం లేదా..? ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకునేలా చొరవ చూపే బాధ్యత లేదా..? అని ప్రశ్నించారు.

యూనివర్సిటీ విద్యార్థులకు భద్రత కరువు!

మరోవైపు యూనివర్సిటీ పరిసరాల్లో వన్యప్రాణుల సంచారం విద్యార్థులను భయాందోళనకు గురి చేస్తోంది. ఈ నెల 17న బాయ్స్ హాస్టల్ ప్రాంతంలో ఎలుగుబంటి సంచరించగా, 19వ తేదీ రాత్రి కొండచిలువ కనిపించడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. చెట్ల నరికివేత, మట్టి తరలింపు కారణంగా వన్యప్రాణులు జనావాస ప్రాంతాల వైపు వస్తున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అడవి పందులు, ఎలుగుబంట్లు, కొండచిలువల సంచారం మధ్య విద్యార్థులు ప్రాణభయంతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడటం యూనివర్సిటీ భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.మంత్రులు, ప్రజాప్రతినిధుల మౌనం దేనికి సంకేతం? యూనివర్సిటీలో జరుగుతున్న చెట్ల నరికివేత, మట్టి తరలింపుపై పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముగ్గురు రాష్ట్ర మంత్రులు, ఒక కేంద్ర మంత్రి స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఒకప్పుడు విద్యార్థి ఉద్యమాల్లో పనిచేశామని, నేడు అధికారంలో ఉన్నామని చెప్పుకునే ప్రజాప్రతినిధులు శాతవాహన యూనివర్సిటీ సమస్యలపై ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా మంత్రులు, కేంద్ర మంత్రి యూనివర్సిటీని ప్రత్యక్షంగా సందర్శించి చెట్ల నరికివేత, మట్టి తరలింపు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులను గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని,యూనివర్సిటీ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు కుక్కమల్ల నరేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గాజుల సాయి చరణ్, ఉపాధ్యక్షురాలు పర్రెం రశ్మిత రెడ్డి, కార్యదర్శులు పల్లి నందు, పాదం రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో రయ్ రయ్

- విధుల్లో ఉన్న కార్మికురాలికి గాయాలు
- మద్యం మత్తులో స్కూటీతో "ఢీ"కొట్టిన వ్యక్తి
- హైదర్ గూడలో పారిశుద్ధ్య కార్మికురాలు రాధికకు తీవ్ర గాయాలు
- బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని జైపాల్ రెడ్డి డిమాండ్

ప్రజా వాయిస్||రాజేంద్రనగర్: ప్రజల కోసం రోడ్లను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలికి రాంగ్ రూట్‌లో వచ్చిన స్కూటీ ప్రమాదంగా మారింది.అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడ పిల్లర్ నంబర్ 140 వద్ద గురువారం ఉదయం 6.30 గంటలకు విధులు నిర్వహిస్తున్న కార్మికురాలు కే.రాధికను స్కూటీ "ఢీ"కొట్టింది.మద్యం మత్తులో రాంగ్ రూట్‌లో వచ్చిన మహమ్మద్ ఆదిల్ అనే వ్యక్తి,స్కూటీ నంబర్ టీఎస్07ఈజీ6043, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు ఏఐటీయూసీ నేత వనంపల్లి జైపాల్ రెడ్డి తెలిపారు.ఈ ఘటనలో రాధిక తలకు,కంటికి, కాళ్లకు గాయాలు కాగా, ప్రస్తుతం జోయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ప్రమాద విషయం తెలుసుకున్న తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి రాధికను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మద్యం మత్తులో రాంగ్ రూట్‌లో వాహనం నడిపి విధుల్లో ఉన్న కార్మికురాలిని "ఢీ"కొట్టిన వ్యక్తిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రధాన రహదారులు,హైవేలపై విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ అధికారులు తగిన భద్రత కల్పించాలని కోరారు.ఈ ఘటనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ ఫిర్యాదు చేసినట్లు జైపాల్ రెడ్డి తెలిపారు. బాధితురాలికి న్యాయం జరిగేలా పోలీసులు, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన కోరారు.



బాలికకు న్యాయం.. నిందితుడికి 20 ఏళ్ల జైలు!

- బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం..
- తీర్పు వెలువరించిన వికారాబాద్ కోర్టు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ వికారాబాద్ మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి పి. ప్రదీప్ నాయక్ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు.2017లో తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నంబర్ 76/2017గా ఐపీసీ, పోక్సో, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీస్ చట్టాల కింద కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బాధితురాలికి ప్రభుత్వం తరపున రూ.10 లక్షల పరిహారం మంజూరైంది.మహిళలు, బాలికలపై జరిగే నేరాల పట్ల జిల్లా పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పకడ్బందీ దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కేసులో కీలకంగా పనిచేసిన నాటి తాండూరు ఎస్‌హెచ్‌ఓ ఎం. వెంకట రామయ్య, నాటి డీఎస్పీ ఎం. రామచంద్రుడు, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ జి. పరమేశ్వర్ గౌడ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెరాజ్ ఫిర్దౌస్, భరోసా కేంద్రం ప్రతినిధి కీర్తి ఆకులతో పాటు కోర్టు డ్యూటీ, లైజన్ అధికారులు ఎం.డి. షరీఫ్, ఎం.డి. తౌఫీక్, ఎస్. నిరంజన్ గౌడ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చిన్న పత్రికలను చిన్నచూపు చూడొద్దు.. సమాచారం ఇవ్వాల్సిందే



.ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 20: ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం విషయంలో కొంతమంది అధికారులు చిన్న, పెద్ద పత్రికలు అంటూ వివక్షత చూపిస్తున్నారని విలేకరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పెద్ద పత్రికలకు మాత్రమే సమాచారం ఇచ్చి, చిన్న పత్రికల విలేకరులను పట్టించుకోకపోవడం ఏం న్యాయమని ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమాలకు పిలవకపోవడం, ఫోన్ చేసినా సరిగా స్పందించకపోవడం, సమాచారం దాచిపెట్టడం వంటివి జరుగుతున్నాయని వాపోతున్నారు.ప్రజల సొమ్ముతో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం అధికారుల సొంత ఆస్తి కాదు. అది ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. దాన్ని కొందరికే పరిమితం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం.చిన్న పత్రికలే గ్రామాల్లోని నిజమైన సమస్యలను బయటకు తీస్తాయి. అలాంటి పత్రికలను అవమానపరిస్తే ఊరుకోబోమని విలేకరులు హెచ్చరిస్తున్నారు.ఇక నుంచైనా అధికారులు తీరు మార్చుకోవాలి. అన్ని పత్రికలకు సమానంగా సమాచారం ఇవ్వాలి. లేకపోతే విలేకరుల సంఘం తరపున పై అధికారులకు ఫిర్యాదు చేయక తప్పదని స్పష్టం చేస్తున్నారు.



ప్రపంచానికి ఆదర్శంగా హైదరాబాదులో వైద్యం

- ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రి యజమాన్యాలు సహకరించాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రజా వాయిస్ సంగారెడ్డి : ఆరోగ్య రంగంలో తెలంగాణను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, హాస్పిటళ్ల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు ఉన్న వైద్యరంగ సామర్థ్యాన్ని మరింత విస్తరించి, మెడికల్ టూరిజంలో నగరాన్ని గ్లోబల్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర సెక్రటేరియట్‌లో శుక్రవారం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ హెల్త్ కేర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య రంగాల్లో వస్తున్న మార్పులు, తెలంగాణలో వైద్య సేవల విస్తరణ, మెడికల్ టూరిజం అభివృద్ధి, వైద్య విద్య, నైపుణ్యాల పెంపు తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ప్రపంచస్థాయి వైద్య నిపుణులు, అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని సమన్వయం చేసుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌లో హెల్త్‌కేర్ రంగ ప్రతినిధులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ హాస్పిటళ్లలోనూ మెడికల్ టూరిజం సేవలు...

మెడికల్ టూరిజం అభివృద్ధికి ప్రైవేటు రంగంతోపాటు ప్రభుత్వ హాస్పిటళ్లలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. సనత్‌నగర్‌లోని డాక్టర్ మురి చెన్నారెడ్డి టిమ్స్, నిమ్స్, అల్వాల్ టిమ్స్, కొత్తపేట టిమ్స్‌లలో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం వార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లలో ఉన్న అత్యుత్తమ వైద్య నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా విదేశీ రోగులకు కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మెడికల్ టూరిజం అభివృద్ధి కోసం ఆరోగ్యశాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అంతర్జాతీయ రోగులకు అవసరమైన సేవలు, సమన్వయం, ఇతర సదుపాయాలను ఒకే వ్యవస్థ ద్వారా అందించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ వైద్యులకు ఉచితంగా శిక్షణ

ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రైవేటు హాస్పిటళ్ల డాక్టర్లు తెలిపారు. జాయింట్ రీప్లేస్‌మెంట్, న్యూరో సర్జరీ, కార్డియో థొరాసిక్ సర్జరీ వంటి ప్రత్యేక వైద్య విభాగాల్లో ప్రభుత్వ సర్వీసులో కొత్తగా చేరే వైద్యులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు కిమ్స్-సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురువా రెడ్డి, ఇతర వైద్యులు వెల్లడించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో హానరరీ ప్రొఫెసర్లుగా సేవలందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.దీనిపై మంత్రి స్పందిస్తూ.. ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేద, మధ్యతరగతి రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ క్రమంలో ప్రైవేటు రంగంలోని అనుభవజ్ఞులైన వైద్యుల సేవలు, నైపుణ్యాలను తప్పకుండా వినియోగించుకుంటామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థల మధ్య పరస్పర సహకారం పెరిగితే వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలపై ప్రశంసలు

కేన్సర్ చికిత్సను జిల్లా స్థాయిలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రతి జిల్లాలో కీమోథెరపీ సెంటర్లు ఏర్పాటు చేయడాన్ని డాక్టర్లు ప్రశంసించారు. అదేవిధంగా డయాలసిస్ సెంటర్ల నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ కిడ్నీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫార్మా వైస్ ప్రెసిడెంట్, కౌన్సిల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కొండపల్లి సాహితి, కిమ్స్-సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురువా రెడ్డి, ఫిక్కీ మెంబర్ సర్జన్ కెప్టెన్ డాక్టర్ విజయ్ కుమార్, రెయిన్‌బో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్, యూఎన్ మాజీ అధికారి డాక్టర్ శివ దుబిశెట్టి, యశోద హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ దశరథ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ తో కుదేలవుతున్న యువత!?

- పేటలో ఆన్లైన్ బెట్టింగు జోరందుకుంటున్న వైనం!
- ముగ్గురు వ్యక్తుల మధ్య లక్షల రూపాయలు మార్పులు?
- మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక పరిస్థితి పై ప్రభావం!
- క్రికెట్ ఆటలపై లక్షల చేతులు మారుతున్న వైనం?
- అధికారుల నిఘు వైఫల్యంతో యువత చెడు దారి వైపు ప్రయాణం!?
- దంతుకుంట కేంద్రంగా బెట్టింగ్ దందా అంటూ ఆరోపణలు?



ప్రజా వాయిస్ అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని ఆన్లైన్ బెట్టింగ్ తో యువత కుదిలైపోతుందని తెలుస్తుంది. పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తుల మధ్య లక్షల రూపాయలు చేతులు మారి మధ్య తరగతి కుటుంబాలను ఆర్థిక పరిస్థితి ప్రభావం చూపటమే కాకుండా రోడ్డున పడే పరిస్థితి సైతం దాపరిస్తుందన్నట్లు ఇటువంటి విధానానికి ప్రధానంగా క్రికెట్ ఆటలపై లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్లు విశసనీయ సమాచారం అధికారులు నిఘు వైఫల్యంతోనే యువత చెడుదారి వైపు ప్రయాణం చేస్తుందని ముఖ్యంగా పట్టణ పరిధిలోని దొంతుకుంట బజార్ కేంద్రంగా మనసుకు ఈ బెట్టింగ్ వ్యవహారం భారీ స్థాయిలో కొనసాగుతున్నట్లు విశ్వసినీయ సమాచారం అంతేకాకుండా నిర్వహణ ఒక లాప్టాప్ వంటి పరికరంతో భారీగా నిర్వహిస్తున్నట్లు సమాచారం అటువంటి సాధనంతోనే లావాదేవులు జరుగుతున్నాయని భారీగా స్థానిక ప్రచారం కలకలం రేపుతుంది ఇటువంటి లావాదేవులన్నీ ఆన్ లోనే జరుగుతున్నాయా లేక నగదు రూపంలో చేతులు మారుతున్నాయి? అంతేకాకుండా బ్యాంకు ఖాతాల ద్వారా లావాదేవుల నిర్వహిస్తున్నారా అన్న కోణంలో అధికార యంత్రాంగం విచారణ కొనసాగిస్తే భారీ స్థాయిలో నమ్మలేని నిజాలు బయటపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

అధికారుల నిఘు జాడ ఎక్కడ?

పోలీస్ స్టేషన్ కి కొద్దిపాటి దూరంలో ఉన్న దంతుకుంట బజార్ నందు బెట్టింగ్ వ్యవహారం భారీగా జరగటం కాకుండా కోట్ల రూపాయలు సైతం చేతులు మారుతున్నట్లు దీని ద్వారా యువతి చెడు అలవాట్లు పడి దొంగతనాలు అసాంఘిక కార్యక్రమాలకు అలవాటు పడే ప్రమాదం పొంచి ఉన్నందున అరికట్టాల్సిన యంత్రాంగం ఎందుకు నిర్మూలించుట లేదో తెలియని పరిస్థితిని అంతేకాకుండా బెట్టింగ్ వ్యవహారంపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే అనేక వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు స్థానికులు కోరుతున్నారు.

అసలు దంతుకుంట గ్రామంలో ఏం జరుగుతుంది.

గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గేమింగ్ ల్యాప్ టాప్ నో వినియోగించి దాని ద్వారా అనేక నగదును చేతులు మారుతున్నాయని అటువంటి దానిని యంత్రాంగం పరిశీలన చేస్తే అనేక వ్యక్తుల పాత్ర ఎంతవరకు ఉంది కోట్ల రూపాయలు బెట్టింగ్ ప్రచారం నిజం ఎంత ఎవరెవరికి ఎప్పుడు ఎంతెంత సరఫరా చేశారు అన్న ప్రశ్నలకు అనేక సమాధానాలు దొరికే అవకాశం ఉంటుందని ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారుల స్పందించాలంటూ అశ్వారావుపేట పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు

ఐకేపీ కేంద్రంలో కోతుల వీరంగం..!

- రెండేళ్లుగా తప్పని కోతుల బెడద
- రైతులకు తీవ్ర నష్టం- అధికారులు స్పందించాలి..!



ప్రజా వాయిస్ /దుబ్బాక : దుబ్బాక మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీ ఆవరణలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కోతుల బెడద రోజు రోజుకూ పెరుగుతోంది. కోతుల గుంపులు కేంద్రంలోకి చొరబడి ధాన్యాన్ని చిందరవందర చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి.గత రెండేళ్లుగా గోసాన్‌పల్లి గ్రామంలో కోతుల సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్ ఇప్పటివరకు సమస్యను పరిష్కరించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల కారణంగా ఇప్పటికే పలువురు రైతులు తమ పంటలను నష్టపోయారని తెలిపారు. ప్రస్తుతం ఐకేపీ కేంద్రానికి రైతులు ధాన్యాన్ని తీసుకొస్తున్న సమయంలో కోతుల గుంపులు వచ్చి ధాన్యాన్ని చిందరవందర చేస్తూ, కింద పడేస్తూ నష్టం కలిగిస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామ సర్పంచ్‌తో పాటు సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పాఠశాలకు వెళ్లాలంటేనే భయానికి భయానికి లోనవుతున్న విద్యార్థులు. గ్రామ పాఠశాల గోడల మీద కోతులు ఎక్కువ సంఖ్యలో విరంగం చేయడంతో విద్యార్థులు తమ తల్లి ని గానీ, తాండ్రని గానీ పాఠశాల వరకు తీసుకెళ్ళ వలసిన పరిస్థితి ఏర్పడింది. స్కూల్ యాజమాన్యం కూడా స్కూల్ క్లాస్ రూమ్లలోకి వెళ్లాలంటేనే ఇబ్బంది పడుతున్నారని, అంతే కాకుండా స్కూల్ లో పిల్లలకు వంట చేసే వంట వారిని సైతం వంట చేయనియ కుండా కోతులు బయపెడుతున్నట్లు వంట సామాన్లు పాడు చేస్తున్నట్లుగా స్కూల్ యాజమాన్యం వంట వారు వాటిని తగిన అధికారులకు చెప్పి వాటి నుండి విముక్తి కల్పించాలని కోరుకుంటున్నారు.

అధికారులు స్పందించాలి..!

సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కోతుల బెడదను నివారించేందుకు తగిన చర్యలు చేపట్టాలని, ఐకేపీ కేంద్రంలో రైతుల ధాన్యానికి రక్షణ కల్పించాలని గోసాన్‌పల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు. రైతులు మరింత నష్టపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి

- చెడు వ్యసనాలకు దూరంగా ఉండి
- వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కండి
- అవగాహన ర్యాలీ

ప్రజా వాయిస్ కొత్తగూడయువత, విద్యార్థులు అన్ని రకాల వ్యసనాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిస్తూ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడ మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.కళాశాల ప్రాంగణం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా కొత్తగూడ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యసనాల వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేసే ప్లకార్డులు చేతబూని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మాట్లాడిన అధ్యాపకులు, భవిష్యత్ తరాల బంగారు భవిష్యత్తు కోసం యువత మత్తు పదార్థాలు, ఇతర దురలవాట్లకు బానిస కాకూడదని హితవు పలికారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండే యువత అవసరం ఎంతో ఉందని వారు పేర్కొన్నారు. కొత్తగూడ సెంటర్ వద్ద విద్యార్థులు చేసిన నినాదాలు స్థానికులను ఆకట్టుకున్నాయి.ఈ ర్యాలీలో ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కులం కుంపట్లలో కాలిపోతున్న యువత భవిష్యత్తు!

- యువతను పావులుగా వాడుకుంటున్న స్వార్థపరులు
- కేసులు, గొడవలతో ప్రశ్నార్థకంగా మారుతున్న జీవితాలు!
- తల్లిదండ్రుల ఆశలను ఆవేశాలకు బలి చేయొద్దు
- విభేదాలు సృష్టించేవారిని గుర్తించి అప్రమత్తం కావాలి
- రెచ్చగొట్టే మాటలకు ఆవేశపడితే నష్టపోయేది యువతే



ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో: నేటి ఆధునిక సమాజంలో యువత విద్య, ఉద్యోగాలు, వ్యాపార రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన సమయంలో కొందరు స్వార్థపరులు రాజేస్తున్న కులం చిచ్చుకు బలవుతున్నారు. కులం పేరుతో యువతలో విద్వేష భావాలు నింపుతూ, సమాజంలో విభేదాలు సృష్టిస్తున్న వారి మాటలకు ఆకర్షితులై తమ విలువైన జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారు.కులం అనేది మనిషికి ఒక సామాజిక గుర్తింపు మాత్రమే. కానీ కొందరు దానిని తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటూ యువతను పావులుగా మార్చుకుంటున్నారు. అవసరమైనప్పుడు కులం పేరుతో రెచ్చగొట్టి, గొడవలు జరిగినప్పుడు మాత్రం పక్కకు తప్పుకుంటున్నారు. చివరకు కేసులు, కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడేది యువతే. నష్టపోయేది వారి కుటుంబాలే.ఒక్కసారి ఆలోచించండి! తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి పిల్లలను చదివించి ఉన్నత స్థాయికి చేరాలని కలలు కంటారు. కానీ ఎవరో చెప్పిన మాటలకు ఆవేశపడి కులాల పేరుతో గొడవలకు దిగితే ఆ తల్లిదండ్రుల ఆశలు ఏమవుతాయి? ఒక కేసు, ఒక గొడవ, ఒక తప్పుడు నిర్ణయం యువకుడి భవిష్యత్తును పూర్తిగా మార్చేయవచ్చు. ఉద్యోగ అవకాశాలు కోల్పోవచ్చు. కుటుంబ గౌరవం దెబ్బతినవచ్చు. జీవితాంతం బాధపడాల్సిన పరిస్థితి రావచ్చు.

ఆవేశానికి కాదు..ఆలోచనకు పదును పెట్టాలి

యువతను రెచ్చగొట్టేవారు తమ ప్రయోజనాల కోసం వారిని ఉపయోగించుకుంటున్నారా? లేక నిజంగా వారి భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నారా? అనే ప్రశ్న ప్రతి యువకుడి మనసులో మెదలాలి. కులం పేరుతో ప్రేరేపించే ప్రతి మాట వెనుక ఉన్న ఉద్దేశాన్ని విశ్లేషించాలి. ఆవేశం కంటే ఆలోచనకు ప్రాధాన్యత ఇవ్వాలి.కులాల మధ్య ఐక్యతను దెబ్బతీయడం వల్ల ఎవరికీ మేలు జరగదు. సమాజంలో ప్రశాంతత, పరస్పర గౌరవం, సోదరభావం పెరిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం కల్పించింది. వాటిని కాపాడాల్సిన బాధ్యత యువతపై కూడా ఉంది.

యువత గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే..

కులం పేరుతో గొడవ పడితే ఎవరో ఒకరి స్వార్థం నెరవేరవచ్చు. కానీ మీ భవిష్యత్తు మాత్రం ప్రశ్నార్థకమవుతుంది.కులం కోసం జీవితాలను నాశనం చేసుకోవద్దు. చదువు, ఉద్యోగం, ఉపాధి, కుటుంబ అభివృద్ధి కోసం పోరాడండి. కులాల పేరుతో విడిపోవడం కాదు.. మానవత్వం పేరుతో కలిసుండటం నేర్చుకోండి.



కరువు కాటుకు ప్రజలు, రైతులు బలికాకముందే ప్రభుత్వం మేల్కొనాలి

- ప్రజలకు నీటి కోతలు.. పాలకులకు పూర్తి జీతాలా ఇదేనా ప్రజాస్వామ్యం
- ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ ప్రశ్న.

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 20 : ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో రాబోయే రోజుల్లో తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చే పరిస్థితులు ఏర్పడితే వాటిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసిందా అని ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.కరువు పరిస్థితులు ఏర్పడిన తర్వాత సమీక్షలు నిర్వహించడం, ప్రజలు ఇబ్బందులు పడిన తర్వాత అధికారులను ఆదేశించడం, రైతులు పంటలు నష్టపోయిన తర్వాత పరామర్శించడం కాదు, సమస్యలు రాకముందే పరిష్కార మార్గాలు చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని ఆయన నిలదీశారు.ప్రజలకు తాగునీరు అందించడానికి మిషన్ భగీరథ పథకం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అనేక గ్రామాలు, కాలనీలు నీటి సమస్యలను ఎదుర్కొంటున్నాయనే ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయి. ఇంటింటికీ నీరు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం, ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితులను ఎందుకు పట్టించుకోవడం లేదు నీటి సరఫరా వ్యవస్థలో లోపాలు ఉంటే వాటిని సరిదిద్దే బాధ్యత ఎవరిది ప్రజలు నీటి కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతోంది అని ప్రశ్నించారు.తాగు నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వద్ద ఉన్న ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ఏమిటి గ్రామాలు, పట్టణాల్లో నీటి నిల్వలు ఎంత ఉన్నాయి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, భూగర్భ జలాల పరిస్థితిపై సమగ్ర సమీక్ష నిర్వహించారా నీటి ఎద్దడి ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, కొత్త బోర్లు, పాత బోర్ల మరమ్మతులు, పైప్‌లైన్‌ల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించారా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని అన్నారు.సాగునీటి విషయంలో కూడా రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు, చెరువులు, కుంటల ద్వారా రైతులకు అవసరమైన నీరు అందించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోతే రైతులకు నష్టపరిహారం అందించే విధానం ఏమిటి పంటల సాగు ప్రణాళికపై రైతులకు ముందస్తు అవగాహన కల్పిస్తున్నారా రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండటం ఎందుకు అని ప్రశ్నించారు .

కరువు వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడం కాదు ..

కరువు రాకముందే చర్యలు తీసుకోవడమే నిజమైన ప్రజాపాలన అని అన్నారు. ప్రజల ప్రాణాలకు, రైతుల పంటలకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నీరు ఎంతో కీలకమని, ఈ అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులు ఇప్పటికైనా సమగ్ర సమీక్ష నిర్వహించి ప్రజలకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.ప్రజలు పన్నులు కడుతున్నారు.. నీటి బిల్లులు చెల్లిస్తున్నారు.. విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు.. ఒక్కరోజు ఆలస్యమైతే జరిమానాలు కూడా భరిస్తున్నారు. మరి ప్రజలకు కనీస తాగునీరు అందించడంలో విఫలమైతే పాలకులు, అధికారులు బాధ్యత వహించరా ప్రజలకు నీటి కోతలు విధిస్తే.. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించే ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల జీతాల్లోనూ కోత విధించే విధానం ఎందుకు ఉండకూడదు అని ప్రశ్నించారు.

ప్రజలకు ఒక న్యాయం.. పాలకులకు మరొక న్యాయమా? ఇదేనా ప్రజాస్వామ్యం?

ఓట్లు అడిగే సమయంలో ప్రజలు గుర్తుకొస్తారు.. గెలిచిన తర్వాత ప్రజల కష్టాలు గుర్తుకు రావా ప్రజల సమస్యలను పరిష్కరించలేని పాలనకు అర్థం ఏమిటి ప్రజలు ఎన్నుకున్న నాయకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం లేదా అని నిలదీశారు.కరువు తలుపు తడుతున్న వేళ ప్రభుత్వం ఇప్పటికైనా అప్రమత్తమై తాగునీరు, సాగునీటి సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని, రైతులకు నష్టం జరగకుండా ముందస్తు ప్రణాళిక అమలు చేయాలని, గ్రామాలు మరియు పట్టణాల్లో నీటి సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని డా. చిలకల శ్రీనివాస్ యాదవ్, బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర పిఏసి సభ్యుడు డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలను పట్టించుకోని పాలనను ప్రశ్నించడం ప్రజల హక్కు అని, ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామని, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు తమ పోరాటం కొనసాగుతుందని డా. చిలకల శ్రీనివాస్ యాదవ్, ఉమెన్ రిజిస్ట్ ప్రొడక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ స్పష్టం చేశారు.

అప్పుల ఊబిలో యువత జీవితాలు!

- అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక వడ్డీల దందా
- గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారం?
- రూ.10, రూ.15, రూ.17 వడ్డీల పేరుతో వేలాది రూపాయల భారం
- వడ్డీ చెల్లించలేక అప్పుల మీద అప్పులు చేస్తున్న యువత!
- లైసెన్సులు ఉన్నాయా? నిబంధనలు పాటిస్తున్నారా?
- తనిఖీలు చేస్తున్నారా? అధికారులకు బహిరంగ ప్రశ్నలు!

ప్రజా వాయిస్ / యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రాజు నాయక్ ప్రత్యేక కథనం:ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సామాన్య ప్రజల అవసరాలను కొందరు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో, యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండల పరిసర గ్రామాల్లో అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చే వ్యవహారం చర్చనీయాంశంగా మారుతోంది. అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరమైన పేద, మధ్య తరగతి కుటుంబాలు, యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఒకవైపు కుటుంబ అవసరాలు, మరోవైపు పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, వ్యవసాయ అవసరాలు, వ్యాపార పెట్టుబడులు, ఇతర అత్యవసర పరిస్థితుల కారణంగా ప్రజలు అప్పుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు అవసరమైన పత్రాలు లేకపోవడం, రుణాల మంజూరులో జాప్యం, తక్షణమే డబ్బు అవసరం కావడం వంటి పరిస్థితులను కొందరు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రూ.10 వడ్డీ.. రూ.15 వడ్డీ.. రూ.17 వడ్డీ.. అసలు ఎంత?

గ్రామీణ ప్రాంతాల్లో రూ.10, రూ.15, రూ.17 వడ్డీలకు అప్పులు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పు తీసుకునే సమయంలో ఒక రకమైన వడ్డీ చెప్పి, తిరిగి చెల్లించే సమయంలో మరింత అధిక మొత్తాన్ని వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించలేకపోతే ఆ వడ్డీనే అసలుగా మార్చి, దానిపై మళ్లీ వడ్డీ లెక్కించడం వల్ల అప్పు మొత్తం అంతకంతకూ పెరుగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.ఒక వ్యక్తి అత్యవసరంగా రూ.లక్ష అప్పు తీసుకుంటే, వడ్డీ చెల్లింపుల పేరుతోనే వేలాది రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు తీసుకున్న అసలు మొత్తం కంటే చెల్లించిన వడ్డీ ఎక్కువవుతున్నా అప్పు మాత్రం తీరడం లేదనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

బెట్టింగ్ లు.. ఆన్ లైన్ గేమింగ్.. అప్పుల ఊబిలో యువత!

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో యువతలో కొందరు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, క్రికెట్ బెట్టింగ్‌లు, ఇతర జూద కార్యకలాపాలకు అలవాటు పడుతున్నారనే ఆందోళనలు ఉన్నాయి. మొదట చిన్న మొత్తాలతో ప్రారంభమయ్యే ఈ వ్యవహారం క్రమంగా పెద్ద మొత్తాల నష్టాలకు దారితీస్తోంది. నష్టాలను తిరిగి సంపాదించాలనే ఆశతో మరిన్ని డబ్బులు పెట్టడం, ఆ డబ్బుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించడం, తీసుకున్న అప్పులు తీర్చలేక మళ్లీ ఇతరుల దగ్గర అప్పులు చేయడం వంటి పరిణామాలు యువతను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి.బెట్టింగ్‌లలో నష్టపోయిన డబ్బులను తిరిగి సంపాదించేందుకు అప్పుల మీద అప్పులు చేస్తూ కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్న యువత కూడా ఉన్నారనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చివరకు అప్పులు తీర్చలేకపోవడం, కుటుంబ సభ్యులకు సమాధానం చెప్పలేకపోవడం, అప్పు ఇచ్చిన వారి ఒత్తిళ్లను తట్టుకోలేక మానసికంగా కుంగిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.ఒకవైపు బెట్టింగ్‌ల మత్తు.. మరోవైపు అధిక వడ్డీల అప్పులు.. ఈ రెండింటి మధ్య యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. అప్పుల బాధతో యువత ప్రాణాలు కోల్పోయే స్థాయికి వెళ్లకుండా ముందుగానే సంబంధిత అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లైసెన్సులు లేకుండానే వడ్డీ వ్యాపారమా?

అసలు ప్రశ్న ఏమిటంటే.. గ్రామాల్లో అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్న ప్రతి ఒక్కరికీ చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా? సంబంధిత శాఖల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నారా? ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వ్యాపారం నిర్వహిస్తున్నారా? అప్పు ఇచ్చినప్పుడు రాత పూర్వక ఒప్పందాలు, లెక్కల పుస్తకాలు నిర్వహిస్తున్నారా?తెలంగాణలో అమలులో ఉన్న తెలంగాణ మనీలెండర్స్ చట్టం, 1349 ఫస్లీ ప్రకారం మనీలెండింగ్ వ్యాపారం నిర్వహించేవారు సంబంధిత అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుని లైసెన్స్ పొందాలి. లైసెన్స్ లేకుండా మనీలెండింగ్ వ్యాపారం నిర్వహించడంపై చట్టంలో శిక్షా నిబంధనలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా గరిష్ఠ వడ్డీ రేటును నిర్ణయించే అధికారం కలిగి ఉంది.అయితే భువనగిరి మండల పరిధిలో ప్రస్తుతం వడ్డీ వ్యాపారం చేస్తున్నవారిలో ఎంత మందికి లైసెన్సులు ఉన్నాయి? ఎంతమంది చట్టబద్ధంగా వ్యాపారం చేస్తున్నారు? సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది.



అధికారులు స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది!

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, భువనగిరి రెవెన్యూ అధికారులు, సంబంధిత లైసెన్సింగ్ అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.భువనగిరి మండల పరిధిలోని గ్రామాల్లో ప్రైవేట్ వడ్డీ వ్యాపారంపై సమగ్ర విచారణ చేపట్టాలి. లైసెన్సులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నవారిని గుర్తించాలి. చట్టవిరుద్ధంగా అధిక వడ్డీలు వసూలు చేస్తున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. వడ్డీ వసూళ్ల పేరుతో బెదిరింపులకు, వేధింపులకు పాల్పడేవారిపై బాధితుల ఫిర్యాదుల ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవాలి.అదేవిధంగా గ్రామాల్లో యువతకు బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ జూదం, అధిక వడ్డీ అప్పుల వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా అర్హులైన పేదలకు సులభంగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలి.



తలుపులు బంద్.. లోపల పనులు!!

- రాత్రి వేళల్లో దోమ తహసీల్దార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది?
- బయట విద్యుత్ దీపాలు ఆఫ్ .. స్థానికుల్లో అనుమానాలు

ప్రజావాయిస్ / వికారాబాద్ జిల్లా బ్యూరో:వికారాబాద్ జిల్లా దోమ మండల తహసీల్దార్ కార్యాలయంలో రాత్రి 8 గంటలు దాటినా అధికారులు విధులు నిర్వహించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కార్యాలయ తలుపులు మూసివేసి లోపల పనులు చేస్తుండటం, బయట విద్యుత్ దీపాలు ఆర్పివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. కార్యాలయం లోపల రాత్రి వేళల్లో ఏం జరుగుతోందంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఈ విషయంపై వివరణ కోరేందుకు డిప్యూటీ తహసీల్దార్‌ను చరవాణి ద్వారా సంప్రదించగా, ల్యాండ్ అక్విజిషన్ ప్రాజెక్టు పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 7 నుంచి 8 గంటల సమయంలో కంప్యూటర్ సర్వర్, ఇంటర్నెట్ సదుపాయాలు అందుబాటులోకి వస్తుండటంతో ప్రభుత్వం అప్పగించిన పనులను పూర్తి చేస్తున్నామని వివరించారు.అధికారులు తెలిపిన కారణం ఇలా ఉండగా, కార్యాలయంలో రాత్రి వేళల్లో పనులు నిర్వహించాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోంది? బయట లైట్లు ఆర్పివేసి లోపల పనులు చేయాల్సిన అవసరం ఏమిటి? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

లాడ్జిలో గది కోసం వస్తే ప్రాణం తీశారు!

- గది కేటాయింపు విషయంలో వాగ్వివాదం, దాడి
- నిందితులను రిమాండ్ కు తరలించిన పట్టణ పోలీసులు
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

భద్రాచలం, నవంబర్ 20, ప్రజా వాయిస్: భద్రాచలం పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. లాడ్జిలో గది అడిగినందుకు దాడికి పాల్పడి, ఓ యువకుడి మృతికి కారణమైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న తెల్లం శరత్ బాబును కలిసేందుకు అతని బంధుమిత్రులు కుర్సం నాగప్రశాంత్, కీసర కార్తీక్ భద్రాచలం వచ్చారు. రాత్రి బస చేసేందుకు సుమారు 10 గంటల సమయంలో రామాలయం సమీపంలోని సత్యసాయి లాడ్జికి వెళ్లి గది అడిగారు. గది కేటాయింపు విషయంలో లాడ్జి యజమాని ద్వార మణికంఠ, బాయ్ బర్ల వినయ్ ఆ ముగ్గురితో వాగ్వాదానికి దిగి దాడి చేశారు. తీవ్రంగా గాయపడి రోడ్డుపై స్పృహ కోల్పోయిన శరత్ బాబును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి తెల్లం రవి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులిద్దరినీ శుక్రవారం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.



ఎంపీని విస్మరిస్తే ప్రజాస్వామ్యానికే అవమానం!

- ప్రజాప్రతినిధుల మధ్య వివక్ష ఎందుకు..?
- కలెక్టర్ వ్యవహారశైలిపై డానియల్ ఆగ్రహం
- ఎంపీ వంశీకృష్ణకు సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పించాలి.
- అధికారుల వ్యవహారశైలిపై ప్రజల్లో చర్చ
- మాల సమాజాన్ని రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నాలను సహించేది లేదు.
- తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ మాల జిల్లా అధ్యక్షుడు డానియల్.

ప్రజా వాయిస్ పెద్దపల్లి, నవంబర్ 20 ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల్లో ఒకరికి ప్రాధాన్యత ఇచ్చి, మరొకరిని విస్మరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ మాల జిల్లా అధ్యక్షుడు డానియల్ అన్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు జిల్లా కలెక్టర్ తగిన గౌరవం, ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల పట్ల అధికారుల వ్యవహారశైలి నిష్పక్షపాతంగా ఉండాలని హితవు పలికారు. శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డానియల్ మాట్లాడుతూ.. ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధులని, వారి హోదా, ప్రజాప్రాతినిధ్యాన్ని గౌరవించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ఒక ప్రజాప్రతినిధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ, మరో ప్రజాప్రతినిధిని విస్మరించడం ఎందుకనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోందన్నారు. జిల్లా కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి, అందరికీ సమాన గౌరవం ఇవ్వాలని సూచించారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణపై జరుగుతున్న కులపరమైన విమర్శలు, దాడులను ఖండిస్తున్నామని, ప్రజాప్రతినిధిని వ్యక్తిగతంగా లేదా కులపరంగా లక్ష్యంగా చేసుకోవడం సరికాదని అన్నారు. దివంగత కాకా వెంకటస్వామి కుటుంబాన్ని రాజకీయంగా బలహీనపరిచే ప్రయత్నాలను మాల సమాజం గమనిస్తోందని,



గడ్డం వివేక్, గడ్డం వంశీకృష్ణలను లక్ష్యంగా చేసుకున్నంత మాత్రాన మాల సమాజం రాజకీయంగా వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకుంటున్న అంతర్గత పరిణామాలపైనా డానియల్ స్పందించారు. కొయ్యూరులో విద్యార్థులకు పాఠశాల బ్యాగుల పంపిణీ చేసిన సందర్భంలో ఓ ఎస్టీ మహిళను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం, శ్రీరాంపూర్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. కనీసం షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, వివరణకు అవకాశం కల్పించకుండా సస్పెన్షన్ విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు?. ఈ వ్యవహారాలపై పార్టీ నాయకత్వం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల, మాదిగల మధ్య విభేదాలు సృష్టించారాదని, రోస్టర్ విధానంలో మాలలకు న్యాయం జరగాలని కోరారు. మాలలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాల సమాజాన్ని రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు.. ప్రజలు ఇచ్చిన పదవులు, బాధ్యతలే ముఖ్యం. ప్రజాప్రతినిధుల పట్ల సమాన గౌరవం చూపడం అధికారుల విధి. ఆ విధిలో విపక్షకు తావుండకూడదు అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ మాల పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోడి సంజీవరావు, సంఘం ఉపాధ్యక్షుడు కనుమల్ల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న విలేకరికి అండగా డాక్టర్ చంద్రప్రియ!

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టుకు ఆర్థిక సాయం..
- మానవత్వానికి నిదర్శనంగా మన చంద్ర ఫౌండేషన్ సేవలు

ప్రజా వాయిస్ / మోమిన్ పేట్ప్రతినిధి ఏదైనా.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం. కష్టకాలంలో బాధితులకు భరోసా కల్పిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మన చంద్ర ఫౌండేషన్ మరోసారి తన ఉదారతను చాటుకుంది.వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామానికి చెందిన వార్తా పత్రిక విలేకరి మంగలి నర్సింలు గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియ శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా నర్సింలు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మన చంద్ర ఫౌండేషన్ తరఫున బాధిత విలేకరికి ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు.ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, బాధిత కుటుంబాలకు మనోధైర్యం కల్పించడం తన బాధ్యతగా భావిస్తానని డాక్టర్ ఏ. చంద్రప్రియ తెలిపారు. ఈ సందర్భంగా తనను పరామర్శించి ఆర్థిక సాయం అందించిన డాక్టర్ చంద్రప్రియకు నర్సింలు కృతజ్ఞతలు తెలియజేశారు.కష్టాల్లో ఉన్నవారికి ఆపన్నహస్తం అందిస్తూ, మానవతా విలువలకు ప్రాధాన్యతనిస్తున్న మన చంద్ర ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్ రెడ్డి, బుచ్చిరాములు, ఫౌండేషన్ సభ్యులు బుధారపు బుచ్చిరెడ్డి, రాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



1.3 కిలోల గంజాయి పట్టివేత.. ముగ్గురు అరెస్ట్

- ఒడిశా నుంచి మహబూబాబాద్ కు తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టివేత
- పల్సర్ బైక్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం
- ఇద్దరు మేజర్లు, ఒక బాలుడు

ప్రజా వాయిస్, బయ్యారం: గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బయ్యారం మండలంలోని సత్యనారాయణపురం రహదారి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ ప్రశాంత్ బాబు బృందం గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పట్టుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన బానోత్ అరవింద్ (జగ్నా తండా), బానోత్ సన్నీ (బెతోల్ తండా), మరో బాలుడు ఒడిశా రాష్ట్రంలోని పలిమెల గ్రామానికి వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి పల్సర్ బైక్‌పై మహబూబాబాద్‌కు తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 1 కిలో 300 గ్రాముల గంజాయితో పాటు పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఇద్దరు మేజర్లు కాగా, మరొకరు బాల నేరస్థుడని గార్ల–బయ్యారం సీఐ రవీందర్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో గంజాయి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు తగిన బహుమతి అందజేస్తామని సీఐ పేర్కొన్నారు.







త్రికుటేశ్వరుడి ఆలయంలో భక్తులకు తీరని నిరాశ!

- ఆలయ ట్రస్టు ఏమి చేస్తోంది? కార్తీక పౌర్ణమి ఏర్పాట్లు ఎక్కడ?
- పూజారి లేక వెనుదిరుగుతున్న భక్తులు
- ఆలయ ట్రస్టు ఉందా? ఉంటే బాధ్యత ఎవరిది?
- కార్తీక పౌర్ణమి ఏర్పాట్లు కనిపించడంలేదు
- గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్

ప్రజా వాయిస్ /పెన్ పహాడ్.భక్తుల విశ్వాసానికి, గ్రామ చారిత్రక గుర్తింపునకు ప్రతీకగా నిలిచిన త్రికుటేశ్వర ఆలయంలో ఇలాంటి పరిస్థితులు కొనసాగడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్వహణ బాధ్యత ఎవరిది? ట్రస్టు సభ్యులు స్పందిస్తారా? గ్రామపంచాయతీ ముందుకొచ్చి ఆలయ నిర్వహణను చక్కదిద్దుతుందా?కార్తీక పౌర్ణమి నాటికైనా ఆలయంలో పూజలు, దీపారాధన, భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టి భక్తుల నిరాశను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత నిర్వాహకులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆలయ నిర్వహణపై తగిన చర్యలు తీసుకుంటారా అన్నది వేచి చూడాల్సిందే.కార్తీక మాసం వచ్చిందంటే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాలి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకోవాలి. కానీ నాగులపహాడ్ గ్రామంలోని చారిత్రక త్రికుటేశ్వర స్వామి ఆలయంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.కార్తీక మాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి వస్తున్నారు. అయితే ఆలయంలో పూజారి అందుబాటులో లేకపోవడంతో కొందరు భక్తులు స్వామివారిని దర్శించుకోకుండానే నిరాశతో వెనుదిరుగుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు కనీస దర్శన సౌకర్యాలు కల్పించలేని పరిస్థితి నెలకొనడంపై స్థానికంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది.ఆలయ ట్రస్టు ఉందా? ఉంటే సభ్యులు ఏమి చేస్తున్నారు?ఆలయ నిర్వహణ కోసం ట్రస్టు లేదా కమిటీ ఉన్నట్లయితే, కార్తీక మాసం వంటి పవిత్ర సమయంలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత వారిపై లేదా? ఆలయ నిర్వహణ, నిత్యపూజలు, ప్రత్యేక పూజలు, దీపారాధన విషయంలో బాధ్యత వహించాల్సిన వారు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి.కార్తీక పౌర్ణమి సమీపిస్తున్నా ప్రత్యేక పూజలు, దీపారాధన, భక్తులకు అవసరమైన సౌకర్యాలపై ఎలాంటి స్పష్టమైన ఏర్పాట్లు కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఆలయ నిర్వహణపై సంబంధిత సభ్యులు దృష్టి సారించి, కనీసం పవిత్రమైన కార్తీక మాసంలోనైనా భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు.గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్!చారిత్రక ప్రాధాన్యత కలిగిన త్రికుటేశ్వర స్వామి ఆలయం నిర్లక్ష్యానికి గురికాకుండా ఉండాలంటే గ్రామపంచాయతీ ప్రత్యేక చొరవ తీసుకోవాలని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ఆలయ నిర్వహణపై స్పష్టత తీసుకురావడంతో పాటు, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా బాధ్యతాయుతమైన నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఆలయంలో నిత్యపూజలు జరిగేలా పూజారి అందుబాటులో ఉండటం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించడం, భక్తులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





ప్రజల ప్రాణాలు పోయాకే అధికారులు స్పందిస్తారా?

- నీరుకుళ్ల బ్రిడ్జి రోడ్డుపై ప్రమాదాలకు ఎవరిది బాధ్యత..!
- హనుమకొండ జిల్లా కార్యదర్శి దళిత బహుజన శ్రామిక విముక్తి హనుమకొండ జిల్లా కార్యదర్శి (సి పి యు ఎస్ ఐ) దామెర మొగిలి

ప్రజా వాయిస్ ఆత్మకూర్ ప్రజల ప్రాణాలు పోతేనే అధికారులు స్పందిస్తారా..? హనుమకొండ జిల్లా ఆత్మకూరు నుండి నీరుకుళ్ల బ్రిడ్జి మీదుగా పత్తిపాక వరకు వెళ్లే రహదారి కంకర, ఇసుకతో ప్రమాదకరంగా మారింది. శ్రీ వెంకటేశ్వర స్టోల్ క్రషర్‌కు సంబంధించిన లారీలు, టిప్పర్ల రాకపోకల కారణంగా బ్రిడ్జి సమీపంలో రోడ్డంతా కంకర, ఇసుక పేరుకుపోయి వాహనదారులు, ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురు ప్రమాదాలకు గురై గాయపడినా సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడం సిగ్గుచేటు.క్రషర్ కంపెనీ లాభాల కోసం ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం ఎంతవరకు సమంజసం? రోడ్డుపై కంకర, ఇసుక పడకుండా చూడాల్సిన బాధ్యత కంపెనీ యాజమాన్యంపై లేదా?ఆర్ అండ్ బీ అధికారులు ఇకనైనా నిద్ర వీడి వెంటనే రోడ్డుపై పేరుకుపోయిన కంకర, ఇసుకను తొలగించాలి. ఎస్‌వీసీ కంపెనీ యాజమాన్యాన్ని హెచ్చరించి, ఇకపై రోడ్డుపై కంకర, ఇసుక పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యం కొనసాగితే కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.ప్రజల ప్రాణాల కంటే కంపెనీల లాభాలే ముఖ్యమా? ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరిగిన తర్వాత స్పందించడం కాదు, ముందే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిట్టల రాజమౌళి దళిత బహుజన కూలీ రైతు వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్. మరియు జిల్లా నాయకులు ముక్కెర సదానందం. కాడబోయిన మొగిలి. బాపట్ల యుగేందర్. తాళ్లపల్లి స్వామి. దొంక దువ్వ రాజయ్య. జన్ను అనిల్. శనిగరపు బిక్షపతి. ఈర్ల సాంబయ్య.పలువురు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు తుర్కపల్లి విద్యార్థిని ఎంపిక

ప్రజా వాయిస్ /తుర్కపల్లి రాష్ట్రస్థాయి అండర్ 14 బాలికల జట్టు పోటీలో పాల్గొనే ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని భూక్య పవిత్ర ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాపెల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పవిత్రను ఫిజికల్ డైరెక్టర్ ఎం చంద్రమౌళి ,ఉపాధ్యాయ బృందం అభినందించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రంగాల్లో విద్యార్థినీ విద్యార్థులను ముందుకు తీసుకుపోయే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. రాబోవు కాలంలో విద్యార్థిని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు



అజ్మతుల్లా హుస్సేనీకి ఘన సన్మానం, శుభాకాంక్షలు

- ఏఐసీసీ కార్యదర్శిగా, కర్ణాటక రాష్ట్ర ఇన్ ఛార్జ్ గా నియామకంపై హర్షం



ప్రజా వాయిస్, హైదరాబాద్: ఏఐసీసీ కార్యదర్శిగా, కర్ణాటక రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన జనాబ్ అజ్మతుల్లా హుస్సేనీని పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ పట్ల ఆయన కున్న అంకితభావం, నిస్వార్థ సేవలు, నాయకత్వ పటిమకు ఈ పదవి సముచిత గుర్తింపు అని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి రాజకీయాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉస్మాన్ మొహమ్మద్ ఖాన్, సర్దార్ హర్మీందర్ సింగ్, సమద్ భాయ్ తదితరులతో పాటు విగ్నేష్ కుమార్ కట్కూరి, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

ఆగమవుతున్న రైతన్న అక్కరకు రాని పంట

- అరా కోర ఏరా ఆ తర్వాత అనలకు సొర
- నమ్మించి నట్టేట ముంచుతాండ్రు దళారులు
- వదిలేసి చోద్యం చూస్తున్నారు సర్కారు వారు

భద్రాద్రి,కొత్తగూడెం: ప్రజా వాయిస్ నవంబర్ 20: అన్నపురెడ్డిపల్లి:భద్రాద్రి కొత్తగూడెం అశ్వరావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా, సొసైటీలు ఆది నుంచి ధాన్యం కొంటున్న దళారులపైనే వదిలేసి నిర్లక్ష్యం వ్యవహరించడంతో, దళారులు వారి ఇష్టం వచ్చినట్టుగా రైతన్నతో ఆడుకోవడం, ఒక కోసమెరుపు, ఇదిలా ఉండగా ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ వరి కోతకు రావడంతో, కోత ప్రారంభించిన రైతన్నకు ఆదిలో అరాకొర ఎర్రచూపి, ధాన్యం క్వింటాలకు 3300 చొప్పున, నామ మాత్రపు మొక్కుబడిగా నాలుగు రోజులు చెల్లించి, ఐదవ రోజు నుంచి తుఫాను వచ్చింది పైన తగ్గింది, అంటూ కుంటి సాకులు చెబుతూ రైతన్నను నట్టేట ముంచుతూ ఒక గారడి విద్యల. యొక్క రైతాంగాన్ని , కోలుకోలేని దెబ్బతీసి, చివరికి 2400గా, ధర నిర్ణయించి సిండికేట్ గా ఏర్పడి, సంవత్సర కాలం నుంచి రైతన్న పండించిన కష్టాన్ని దోచుకుంటూ, వారి ఇష్ట రాజ్యంగా వ్యాపారాలు కొనసాగిస్తున్న, ఒకపక్క సర్కారు వారు బియ్యం రేటును 60 రూపాయలకు మించి అమ్మ వద్దు అని చెబుతుంది, మరి మేము దాన్యం ఎలా కొనేది అని కుంటి సాగుతో, ప్రభుత్వం చెప్పింది ఒక మాట అయితే దళారు చేసేది దగా అయితే దీనిని ప్రశ్నించే నాధుడే లేకపోవడం గమనార్హం, మరి ఏది ఏమైనా అటు సర్కారు వారు చోద్యం చూడటం. సొసైటీలు ప్రారంభించితే కొంత రైతాంగానికి ఊరట కలిగించే విధంగా ఉండొచ్చని, అనుభవం కల్లరైతులు, వివరణ ఇస్తున్నారు. మరి ఏది ఏమైనా రైతాంగాన్ని పూర్తిస్థాయిలో ఆదుకోవాలి అంటే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఆరంభించి ఈ యొక్క దళారీల మోసాన్ని దగాని ఎండగట్టాలని మండల ప్రజలు వాపోతున్నారు.



తహశీల్దార్ కార్యాలయంలో కంపుకొడుతున్న మూత్రశాలలు

- నీటి సరఫరా లేక నిరుపయోగంగా మారిన మరుగుదొడ్డి
- ప్లాస్టిక్ బాటిళ్లతో నీటిని తీసుకెళ్తున్న ప్రజలు
- మహిళల ఇబ్బందులు పట్టించుకోని అధికార యంత్రాంగం





ప్రజా వాయిస్, తిమ్మాపూర్ (నవంబర్ 20):: ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ప్రభుత్వ కార్యాలయంలోనే పారిశుద్ధ్యం పడకేసింది. నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం వచ్చిపోయే తిమ్మాపూర్ మండల తహశీల్దార్ కార్యాలయంలోని మూత్రశాల దుర్గంధానికి నిలయంగా మారింది. కనీసం నీటి సరఫరా కూడా లేకపోవడంతో మూత్రశాల వినియోగానికి పనికిరాకుండా పోయింది. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.తహశీల్దార్ కార్యాలయానికి భూ సమస్యలు, రెవెన్యూ దరఖాస్తులు, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, రిజిస్ట్రేషన్ల పనుల కోసం ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. అయితే ఇంతటి ప్రజా సంచారం ఉండే కార్యాలయ ఆవరణలో ఒకే మూత్రశాల ఉండగా, దానికి సైతం గత కొన్ని నెలలుగా నీటి సరఫరా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. నీళ్లు లేకపోవడంతో పరిసరాలన్నీ దుర్వాసన వెదజల్లుతూ అపరిశుభ్రంగా మారాయి.మూత్రశాలను ఉపయోగించాలంటే ప్రజలు బయట నుంచి ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయానికి వచ్చిన ప్రజలు కనీస అవసరాల కోసం కూడా ఇలాంటి అవస్థలు పడాల్సి రావడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలల తరబడి సమస్య ఉన్నా పరిష్కారం ఏది?

ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులే ఈ సమస్యను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది రోజూ ఇదే పరిస్థితిని చూస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల నుంచి వివిధ పనుల కోసం దరఖాస్తులు స్వీకరించే కార్యాలయంలో కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించలేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా తహశీల్దార్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మూత్రశాలకు తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలని, పూర్తిస్థాయిలో శుభ్రపరిచి నిరంతర నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ప్రభుత్వ కార్యాలయానికే వచ్చే ప్రజలు కనీస సౌకర్యాల కోసం ఇబ్బందులు పడే పరిస్థితి కొనసాగుతూనే ఉంటుంది. ప్రజల ఆరోగ్యం, గౌరవం, కనీస అవసరాల పట్ల అధికారులు ఇకనైనా బాధ్యతగా వ్యవహరిస్తారా? లేక ఈ దుస్థితిని ఇలాగే కొనసాగిస్తారా? అన్నది వేచి చూడాలి..



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో చికోడు విద్యార్థినుల ప్రతిభ

అండర్-14 బాలికల విభాగంలో మెదక్ జిల్లాకు తృతీయ స్థానం

ప్రజా వాయిస్ /దుబ్బాక :

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని హత్నూర మండలం దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్--14 వాలీబాల్ పోటీల్లో పెద్ద చీకోడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. కే. హారిక, ఏ. శ్యామల మెదక్ జిల్లా జట్టు తరఫున పాల్గొని అద్భుత ప్రతిభ ప్రదర్శించారు. బాలికల అండర్--14 వాలీబాల్ విభాగంలో మెదక్ జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించింది.ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థినులను చీకోడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎస్ జీ ఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడలకు 'దుబ్బాక ' విద్యార్థి ఎంపిక..!

ప్రజా వాయిస్ /దుబ్బాక :



ఎస్ జీ ఎఫ్ మండల స్థాయి మరియు జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన చేసి తేదీ 19 నవంబర్ గురువారం రోజున ఉమ్మడి మెదక్ జిల్లా సెలక్షన్స్ లో అత్యుత్తమ ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయికి క్రీడలకు ఎంపికైనటువంటి దుబ్బాక మైనార్టీ గురుకుల విద్యార్థి సిహెచ్ రామ్ చరణ్ . ఈనెల 22న వరంగల్ జిల్లా తొర్రూరులో జరిగే రాష్ట్ర స్థాయిలో క్రీడలలో పాల్గొంటాడు. రామ్ చరణ్ మంచి క్రమశిక్షణతో మరియు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం చాలా గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ విమలా రెడ్డి, డిప్యూటీ వార్డెన్ హమీద్, పిడి షాదుల్ అధ్యాపక బృందం విద్యార్థులు అభినందించారు.



రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా..

- కుటుంబానికి రూ.5 లక్షల బీమా
- జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్

ప్రజా వాయిస్/దుబ్బాక :

ఇందిరమ్మ కుటుంబ భీమా రూ. 5 లక్షల పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగిందని, ఈ పథకాన్ని ప్రతిఒక్క కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక పురపాలిక కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం దుబ్బాక పురపాలిక కార్యాలయంలో పలువురు వార్డు కౌన్సిలర్లతో కలిసి రూ. 5 లక్షల కుటుంబ జీవిత బీమా పథకం యొక్క గోడపత్రికను ఆవిష్కరించి, ఆన్లైన్లో దరఖాస్తు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డు కలిగినటువంటి ప్రతి కుటుంబంలో కుటుంబ యజమాని పేరున బీమా పథకానికి దరఖాస్తు చేసుకొని, నామినీగా కుటుంబ సభ్యుల పేర్లను జత చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాల ద్వారా పురపాలిక కార్యాలయంలో గాని, వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్న కౌంటర్ల ద్వారా బీమా పథకాన్ని ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 18 నుంచి 59 సంవత్సరాల లోపు వయసు ఉన్న కుటుంబ పెద్ద లేదా కుటుంబాన్ని పోషించే వ్యక్తి పేరు మీద జీవిత బీమా పథకాన్ని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు దేవుని రాజు, అనంతుల భాగ్యమ్మ, కోలా నిరోష, బడుగు రాజు, కో ఆప్షన్ సభ్యులు ఎండి ఖలీల్, నసీమా, నాయకులు బండి రాజు అనంతుల శ్రీనివాస్, ఐరేని సాయి తేజ గౌడ్, కోలా వెంకట్ స్వామి గౌడ్, పురపాలిక మేనేజర్ శ్రీనివాస్, మెప్మా ఆర్పీలు, పుర సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య....

ప్రజా వాయిస్ /దుబ్బాక :



చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జీవితం మీద విరక్తి చెందిన ఒక వ్యక్తి గడ్డిమందు తాగి, అనంతరం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక మండలం కమ్మరపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం... కమ్మరపల్లి గ్రామానికి చెందిన పంబల గణేష్ (41) గ్రామంలో వ్యవసాయం చేస్తూ, భార్యాపిల్లలతో జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల వ్యవసాయ పనుల నిమిత్తం ఒక ట్రాక్టర్ ను ఈఎంఐ లో కొనుగోలు చేశాడు. దానితోపాటు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు లోన్ తీసుకున్నాడు. వ్యవసాయ పనులు సరిగ్గా లేకపోవడంతో ఈఎంఐలు, ఇంటి లోన్లు చెల్లించలేక, గత కొంతకాలంగా గణేష్ తనలో తాను బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న గుడిసెలో గడ్డి మందు తాగి, అక్కడే దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలానికి వెళ్ళిన భర్త ఇంటికి తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు పొలం వద్దకు వచ్చి చూడగా, పొలం వద్ద ఉన్న గుడిసెలో ఉరి వేసుకున్న స్థితిలో గణేష్ మృతదేహం గుర్తించారు. అనంతరం జరిగిన ఘటనను గ్రామస్తులకు, పోలీసులకు చేరవేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య కనకవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముల్కనూర్ సహకార సంఘానికి జాతీయ స్థాయి పురస్కారం

70 ఏళ్ల విశిష్ట సేవలకు జాతీయ గుర్తింపు

ప్రజా వాయిస్ భీమదేవరపల్లి

ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ కు జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. దేశవ్యాప్తంగా సహకార రంగంలోని ఉత్తమ సంస్థలను గుర్తించి సత్కరించే ఇండియన్ కో ఆపరేటివ్ సమితి అండ్ ఎక్సెన్స్ అవార్డు కార్యక్రమంలో సభ్యులకు విశిష్ట సేవలు అందిస్తున్నందుకు ముల్కనూరు సహకార సంఘం ఈ అవార్డు అందుకుంది. ఇండియన్ కో ఆపరేటివ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవార్డుల కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘాలు, జిల్లా సహకార బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకులు, పట్టణ సహకార బ్యాంకులు తదితర సంస్థలకు వాటి విభాగాల్లో అత్యుత్తమ



పనితీరుకు గుర్తింపునిస్తూ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా దేశంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి మరియు మార్కెటింగ్ సహకార సంఘాల్లో ముల్కనూరు సంఘం ఒక్కటే ఈ జాతీయ అవార్డుకు ఎంపిక కావడం విశేషం. రైతులకు ఒకే వేదిక ద్వారా సమగ్ర సేవలు అందిస్తూ, గత 70 సంవత్సరాలుగా నాలుగు తరాల రైతులతో బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తున్న సంఘం సేవలకు ఈ పురస్కారం ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు నిరంతర సేవలందిస్తూ వస్తున్న ముల్కనూరు సహకార సంఘం సేవలను జాతీయ స్థాయిలో గుర్తించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సేవలను మెరుగుపరచడం సంఘం ప్రధాన లక్ష్యమని, ప్రస్తుతం సభ్యుల లావాదేవీలను మరింత సులభతరం, వేగవంతం చేసేందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టే కార్యక్రమాలు చేపడుతున్నామని, వీటి అమలు త్వరలో ప్రారంభం కానుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, ఇండియన్ కో-ఆపరేటివ్ ఎడిటర్ అజయ్ జూ ఆర్బిఐ మరియు నాబార్డ్ బోర్డుల మాజీ డైరెక్టర్ శ్రీ సతీష్ మరాటి పాల్గొన్నారు.

ఎస్డిఎఫ్ ఐటిడిఏ ద్వారా మండలానికి ప్రత్యేక నిధులు మంజూరు

మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మండలం లో 14 కోట్ల రూ లతో. సీసీ రోడ్లు

ప్రజా వాయిస్ కొత్తగూడ

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో భారీగా అభివృద్ధి పనులు తెలంగాణ రాష్ట్రపంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి ' స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క వారి ప్రత్యేక చొరవతో ఎస్డిఎఫ్ ఐటిడిఏ ద్వారా మండల కేంద్రానికి ప్రత్యేక నిధులు 14, కోట్ల రూ.,లతో సీ సీ రోడ్లు కల్పించారు.మొదటిసారిగా మండలంలోని జంగవానిగూడెం లో 30 సీ సీ రోడ్లు ఒక కోటి 50 లక్షలతో (కోటిన్నర) రూ.తో గ్రామ సర్పంచ్ గొంది సోనీ రాజు వారి ఆధ్వర్యంలో సీసీ రోడ్లు ప్రారంభోత్సవం చేశారు.ఏజెన్సీ ప్రాంతంలో వెనుకబడిన కొత్తగూడ మండల కేంద్రముకు మంత్రి సీతక్క ప్రత్యేక



చొరవతో 14 కోట్ల రూపాయలు ప్రత్యేక నిధులు కల్పించిన మంత్రి సీతక్కకు, ఐటీడీఏ పిఓ కు ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు రాంపూర్ లో టెంకాయ కొట్టి సిసి రోడ్డు ప్రారంభోత్సవం చేసిన స్థానిక సర్పంచ్ గొంది సోనీ రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బానోత్ రూప్సింగ్, కొత్తగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి, మాజీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాస్, క్లస్టర్ ఇన్చార్జి దారం భూపాల్, ఉప సర్పంచ్ మహేందర్, సతీష్, మల్లయ్య, సారంగపాణి, యాకబాబు,కృష్ణ కారం వేగ బాబు గ్రామ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ యాకుబ్ ఆకస్మిక మృతితో ఆ కుటుంబంఒక్క పూటలో అనాధగా మారింది

ఇంటర్మీడియట్ చదివే కూతురు
ఏడవ తరగతి చదివే కుమారుడు.
బయటి ప్రపంచం తెలియని భార్య
అద్దె ఇంట్లో జర్నలిస్ట్ యాకూబ్ మృతదేహం.
కన్నీళ్ళు తెప్పించి హృదయాన్ని కదిలించిన సన్నివేశం
యాకుబ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస్

ప్రజా వాయిస్,మహబూబాబాద్

టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా యూనిట్ పక్షాన జర్నలిస్ట్ కుటుంబానికి రూ.5వేల (ఐదువేల రూపాయల) తక్షణ సహాయం.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్ట్ యాకూబ్ మృతి చెందిన వార్త తెలుసుకుని. నివాళులు అర్పించేందుకు టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస్ తోపాటు పలువురు యూనియన్ బాధ్యులు యాకూబ్ ఇంటికి వెలితే అది అద్దె ఇళ్ళని తెలిసింది.



ఇంటర్మీడియట్ చదివే కూతురు. ఏడవతరగతి చదివే కొడుకు.బయటి ప్రపంచంతో సంబంధం లేని ఓ సాధారణ గృహిణి యాకూబ్ బార్య బోరున విలపిస్తున్న దృశ్యం ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.జర్నలిస్ట్ యాకూబ్ ఆకస్మిక మృతితో ఆ కుటుంబం ఒక్క పూటలో అనాధగా మారింది. ఏం చేయాలో ఎలా చేయాలో రేపేంటో తెలియని అయోమయ పరిస్థితిలో పెను విషాదంలో కూరుకపోయింది.పరిస్థితిని గమనించిన వెంటనే టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా యూనిట్ పక్షాన జరగాల్సిన కార్యక్రమాల కోసం తక్షణసహాయంగా.., జర్నలిస్ట్ కుటుంబానికి తమ శక్తి మేరకు అండగా నిలవాలనే ఆలోచన రూ.5 వేల (ఐదువేల రూపాయలు) తక్షణసహాయాన్ని మృతుడు యాకూబ్ కుమారునికి టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ అందజేసారు.., తండ్రిని కోల్పోయి రోదిస్తున్న ఆ.. బాలుడిని అక్కున చేర్చుకుని ఓదార్చి ధైర్యం చెప్పారు.ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రతి సహాయాన్ని మృతి చెందిన జర్నలిస్ట్ సోదరుడు యాకూబ్ కుటుంబానికి అందేలా చూస్తామని., అండగా ఉంటామని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ..కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి., జిల్లాఉపాధ్యక్షుడు ఉమ్మగాని మధు., ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లాప్రధానకార్యదర్శి రంగాచౌదరి, యూనియన్ బాధ్యులు మహేష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పేదల జీవితాల్లో 'చేయూత' వెలుగులు!

చెట్ల ముకుందాపురంలో పెన్షన్ పత్రాల పంపిణీ
ముఖ్య అతిథిగా తూముల భుజంగరావు
సర్పంచ్ పోనుగోటి నరేందర్ ఆధ్వర్యంలో వేడుక
పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నేతల భరోసా

పెన్ పహాడ్, నవంబర్ 20(ప్రజా వాయిస్):

మండల పరిధిలోని చెట్ల ముకుందాపురం గ్రామంలో శుక్రవారం సంక్షేమ సంబరం అంబరాన్నంటింది. గ్రామ సర్పంచ్ పోనుగోటి నరేందర్ ఆధ్వర్యంలో 'చేయూత' పెన్షన్ లబ్ధిదారులకు నూతన ప్రొసీడింగ్ ఆర్డర్ల పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మార్కెట్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తూముల భుజంగరావు ముఖ్య అతిథిగా విచ్చేసి, సర్పంచ్ నరేందర్‌తో కలిసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా తూముల భుజంగరావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఎలాంటి వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. కొత్తగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూడటం ఎంతో సంతృప్తినిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నేని కోటేశ్వరరావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు నాతాల వెంకట్ రెడ్డి, పెన్ పహాడ్ సర్పంచ్ ఒగ్గు రవి, చిన్నగారకుంట తండా సర్పంచ్ వసంత శీను, న్యూ బంజారా హిల్స్ తండా సర్పంచ్ కవిత రవీందర్, చందూలాల్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణు గ్రామ వార్డు మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఒక్క తల్లికి పుట్టలే కానీ ' అన్నదమ్ములు'..!

- సోలిపేట పేరు ప్రస్తావించడం స్వాగతిస్తున్నాం
- ముఖ్యమంత్రికి ఆ ముగ్గురే టార్గెట్టా..

ప్రజా వాయిస్/ దుబ్బాక:

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభల పేరుతో కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావును విమర్శించడం సరికాదని, నిండు సభలో దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి పేరు తీయడం సాగదీస్తున్నామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోలిపేట సతీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హరీష్ రావు పై విమర్శ చేయడం సిగ్గుచేటని అన్నారు. భహిరంగ సభల పేరుతో ఆ ముగ్గురిని టార్గెట్ చేసి విమర్శిస్తున్నారని తెలిపారు. హరీష్ రావు-సోలిపేట రామలింగారెడ్డి ఒక తల్లికి పుట్టలే కానీ వారు అన్నదమ్ములని గుర్తు చేశారు. సభలో సోలిపేట రామలింగారెడ్డి స్వాగతిస్తున్నామని కానీ హరీష్ రావు ను విమర్శించడం సరికాదని అన్నారు. విమర్శించడమే లక్ష్యంగా సీఎం సభలు నిర్వహిస్తున్నారని అన్నారు. అభివృద్ధి పట్ల ఒక్క మాట మాట్లాడకపోవడం హాస్యస్పదమని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, ముందుగానే తెలంగాణను ప్రకటించినట్లయితే 1200 మంది యువకులు ఆత్మ బలిదానం కాకపోవచ్చు కదా అని ప్రశ్నించారు. శంకరమ్మ ను సభలకు తీసుకొచ్చి సానుభూతి పొందాలని చూస్తున్నాడని విమర్శించారు. ఇప్పటికైనా విమర్శలు మాని అభివృద్ధి కోసం ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దేవుని రాజు(బండలు), రాష్ట్ర నాయకులు రొట్టె రాజమౌళి, ఆస స్వామి, పర్స దేవరాజ్, తౌడ శ్రీనివాస్, చెట్టి కృష్ణంరాజు, రాయిని వెంకటేష్ (పండు), ఆస రవి, చందు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులోనూ తీవ్ర నిర్లక్ష్యం.. ప్రజలను మభ్యపెడుతున్న పాలకులు

బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగదిరిగుట్ట డివిజన్ సంక్షేమ పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మరోసారి మోసం చేస్తోందని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు తీరును చూస్తుంటే ఇందిరమ్మ ఆత్మ కూడా క్షోభించే పరిస్థితి నెలకొందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, కొత్త పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సైతం కొనసాగించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతులతో పాటు కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, గౌడన్నలు, నేతన్నలు, ఇతర కార్మిక వర్గాల కోసం అమలులో ఉన్న బీమా పథకాలను సక్రమంగా కొనసాగించడంలో ప్రభుత్వం



విఫలమైందన్నారు. కనీసం బీమా ప్రీమియం చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉండటం దారుణమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలుకు నిధులు లేవంటూ చేతులెత్తేస్తున్న ప్రభుత్వం, ప్రజలకు మాత్రం అరచేతిలో వైకుంఠం చూపిస్తూ అబద్ధపు హామీలతో కాలం వెళ్లదీస్తోందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ. 2,500, వృద్ధులకు రూ. 6,000 పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు అమలు చేస్తామని ప్రకటించి ఇప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. మూడేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇందిరమ్మ పేరుతో పథకాలను ప్రకటిస్తూ ప్రచార ఆర్భాటానికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, వాటి అమలులో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజా సంక్షేమం కంటే సొంత కాంట్రాక్టులు, కమీషన్లకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో కనిపించడం లేదని విమర్శించారు. సంక్షేమ పథకాలను అమలు చేయలేకపోతున్నామని స్వయంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలే అంగీకరిస్తున్న పరిస్థితి ఉందని అన్నారు. ఇందిరమ్మ పేరుతో పథకాలు ప్రకటించి వాటిని అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రశ్నిస్తుందని, ప్రజల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని కేపీ వివేకానంద్ స్పష్టం చేశారు.



54 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్లు....

గ్రామ సర్పంచ్ ఎర్ర వెంకయ్య...

ప్రజా వాయిస్, పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని పొడ్చాన్ పల్లి గ్రామంలో శుక్రవారం నాడు చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 54 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకయ్య, ఉప సర్పంచ్ సంతోష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రజినీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు భూమిరెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రాము, మరియు కాంగ్రెస్ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా

అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ

ఇద్దరు బాధితులకు రూ.1.03 లక్షల ఆర్థిక సాయం

పేదల వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండ

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి

ప్రజా వాయిస్, బయ్యారం..

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సాయాన్ని అర్హులైన బాధితులకు అందజేస్తూ వారి కుటుంబాల్లో భరోసా నింపుతున్నారు. ఈ క్రమంలో బయ్యారం మండల పరిధిలోని ఇద్దరు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ



నిధి ద్వారా మంజూరైన చెక్కులను జూలకంటి సీతారాం రెడ్డి అందజేశారు. కోడిపుంజుల తండాకు చెందిన వెర్ర్సా నాయక్‌కు రూ. 59 వేల చెక్కును, రామచంద్రపురం గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్.సి.పురం గ్రామానికి చెందిన స్వామికి రూ. 44 వేల చెక్కును పంపిణీ చేశారు. మొత్తంగా ఇద్దరు బాధితులకు రూ. 1.03 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా జూలకంటి సీతారాం రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వైద్య ఖర్చులు భరించడం భారంగా మారుతుందని, అలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తోందని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న ఆర్థిక సాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొంటూ, చెక్కులు అందుకున్న బాధితులు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...



డిజిటల్ వేదికపై 'మెదక్ జీనియస్ క్వెస్ట్-2026'...

జిల్లా స్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

ప్రజా వాయిస్ ,పాపన్నపేట

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను, మేధాశక్తిని వెలికితీసేందుకు పాపన్నపేట మండల కేంద్రంలో శుక్రవారం (నవంబర్ 20, 2026) 'మెదక్ జీనియస్ క్వెస్ట్-2026' మండల స్థాయి క్విజ్ పోటీలను అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి (ఎంఈఓ) ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన, క్విజ్ ఇంచార్జి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. మహేశ్వర్ సమక్షంలో ఈ పోటీలు జరిగాయి.

11 పాఠశాలల విద్యార్థుల హోరాహోరీ పోరు:

మండల పరిధిలోని 11 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ క్విజ్ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటిసారిగా ఆన్‌లైన్ విధానంలో, డిజిటల్ బోర్డులను ఉపయోగిస్తూ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పోటీలను నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

జిల్లా స్థాయికి ఎంపికైన విజేతలు

10వ తరగతి: నేహా (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యూసుఫ్ పేట)

9వ తరగతి: అక్షత్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడాపాక)

8వ తరగతి: మచ్చేందర్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్లంపేట)

విద్యార్థుల మేధాశక్తికి పదును: ఎంఈఓ ప్రతాప్ రెడ్డి

ఈ సందర్భంగా ఎంఈఓ ప్రతాప్ రెడ్డి గారు మాట్లాడుతూ.. ఆధునిక డిజిటల్ బోర్డుల ద్వారా ఆన్‌లైన్ విధానంలో క్విజ్ నిర్వహించడం వల్ల విద్యార్థులకు కొత్త అనుభూతి కలగడమే కాకుండా, వారి జ్ఞానాన్ని, సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా క్విజ్‌లో పాల్గొనడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతటి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ గారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. మహేశ్వర్ , క్విజ్ మాస్టర్లు, టెక్నికల్ సపోర్ట్ టీమ్ సభ్యులు మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని విజేతలను అభినందించారు.

ప్రాణాపాయంలో బాలుడు.. వైద్యానికి రూ.30 లక్షలు

- **డెంగీ, గుండె సమస్యలు, న్యుమోనియాతో నాలుగేళ్ల అభినవ్ పోరాటం**
- **హైదరాబాద్ రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స..**
- **ఈసీఎంఓ వైద్య ప్రక్రియ అవసరమంటున్న వైద్యులు**
- **ఆర్థిక స్థోమత లేక దాతల సాయం కోసం కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు**

ప్రజా వాయిస్ పెద్దపల్లి

ఆడుతూ పాడుతూ ఆనందంగా గడపాల్సిన బాల్యం ఆసుపత్రి మంచానికే పరిమితమైంది. పసివయసులోనే అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో నాలుగేళ్ల బాలుడు అభినవ్ ప్రాణాలతో పోరాడుతున్నాడు. కుమారుడికి మెరుగైన వైద్యం అందించాలంటే సుమారు రూ.30 లక్షలు అవసరమని వైద్యులు సూచించడంతో నిరుపేద తల్లిదండ్రులు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జీడీనగర్ గ్రామానికి చెందిన సంపంగి సమ్మయ్య, మౌనిక దంపతుల కుమారుడు అభినవ్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. డెంగీ పాజిటివ్‌తో పాటు కాలేయ సంబంధిత సమస్య, గుండె సమస్యలు, న్యుమోనియా సోకడంతో ఆరోగ్య పరిస్థితి



విషమించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో అభినవ్‌కు చికిత్స కొనసాగుతోంది. బాలుడి ప్రాణాలు కాపాడేందుకు మరిన్ని వైద్య పరీక్షలతో పాటు ప్రత్యేక వైద్య ప్రక్రియ అవసరమని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఇందులో భాగంగా ఈసీఎంఓ (జుజమీ) చికిత్స చేయాల్సి ఉంటుందని, మొత్తం వైద్య ఖర్చులు సుమారు రూ.30 లక్షల వరకు అవుతాయని తెలిపారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే తమకు ఇంతటి భారీ మొత్తాన్ని సమకూర్చుకోవడం సాధ్యం కావడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం తమది. కష్టపడి పనిచేస్తూ కుమారుడిని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నామని, ఇప్పుడు అదే కుమారుడు ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని తల్లి మౌనిక, తండ్రి సమ్మయ్య కన్నీరుమున్నీరవుతున్నారు. తమ ఆర్థిక పరిస్థితి వైద్య ఖర్చులకు సరిపోవడం లేదని, మానవతా హృదయంతో స్పందించి తమ కుమారుడి ప్రాణాలు కాపాడేందుకు దాతలు ముందుకు రావాలని వేడుకుంటున్నారు. అభినవ్ త్వరగా కోలుకుని మళ్లీ ఇంట్లో నవ్వుతూ తిరగాలని గ్రామస్తులు, బంధుమిత్రులు ఆకాంక్షిస్తున్నారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు, దాతలు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని కోరుతున్నారు. చిన్నారి వైద్యానికి అవసరమైన భారీ మొత్తాన్ని సమకూర్చేందుకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

- **దొంగ బిల్లులతో నిధులు స్వాహా చేస్తున్నారని ఆరోపణ**
- **ఎంపీడీవో చర్యలు తీసుకోవాలని తాజా మాజీ ఎంపీటీసీ బోటుక తిరుపతి డిమాండ్**

ప్రజా వాయిస్ దౌల్తాబాద్, నవంబర్ 20:

గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఎంపీడీవో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ముబారస్ పూర్ తాజా మాజీ ఎంపీటీసీ బోటుక తిరుపతి డిమాండ్ చేశారు. దౌల్తాబాద్ మండలం ముబారస్ పూర్ గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ నిధుల ఖర్చులకు సంబంధించి ట్రాక్టర్ డీజిల్, సర్వీసింగ్ ఖర్చులకు సంబంధించిన బిల్లులపై ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నిస్తే తనను దూషిస్తున్నారని ఆయన ఆరోపించారు. తూప్రాన్‌లోని శశాంక్ ఆటోమొబైల్స్ పేరుతో రూ.26 వేల 270 బిల్లు తీసుకొచ్చారని తెలిపారు. అయితే సదరు ఆటోమొబైల్ దుకాణం రెండేళ్ల క్రితమే మూతపడిందని, అలాంటి దుకాణం పేరుతో ప్రస్తుతం బిల్లులు ఎలా వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంగా భావించి వాట్సాప్ గ్రూపులో ప్రస్తావించానని పేర్కొన్నారు. గ్రామ నిధుల వినియోగంపై ప్రశ్నించినందుకు సర్పంచ్ విజయ భర్త స్వామి వాట్సాప్ గ్రూపులో తనను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆరోపించారు. ప్రజాధనానికి సంబంధించిన లెక్కలు అడగడం తప్పా అని ప్రశ్నించారు. గ్రామ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు పారదర్శకంగా ఖర్చు చేయాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు. గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై ఎంపీడీవో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, బిల్లుల వాస్తవాలను వెలికితీయాలని కోరారు. దొంగ బిల్లులు సృష్టించి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలితే సంబంధిత సర్పంచ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





జోరుగా కల్తీ కళ్ళు విక్రయం...

పట్టించుకోని ఆబ్కారి శాఖ.....

మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్న వైనం....

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ కళ్ళు యజమానుదారులు....

ప్రజా వాయిస్, పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో జోరుగా కల్తీకల్లు విక్రయిస్తున్నప్పటికీ ఆబ్కారి శాఖ మాత్రం చూసి చూడనట్లు పోవడం ప్రశ్నార్థకంగా మారింది. దీనిని ఆసరాగా చేసుకుని కల్తీ కళ్ళు యజమానుదారులు వివిధ రసాయనాలతో కూడిన కల్తీ కళ్ళు తయారుచేసి జోరుగా డబ్బులు దండుకుంటున్నారు. అయినప్పటికీ సంబంధిత శాఖ మాత్రం మామూళ్ల మత్తులో మునిగితేలుతుందని కొందరు గ్రామస్తులు తెలుపుతున్నారు. కల్తీ కల్లుకు బానిసైన యువత తరచూ ఇంట్లో గొడవలు పడుతూ రోడ్డున పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని కల్తీకల్లును అరికట్టాలని వివిధ గ్రామాల గ్రామస్తులు కోరారు



ఇందిరమ్మ ఇళ్లతో పేదింట సొంతింటి కల సాకారం!

లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు

ప్రజావాయిస్/తాండూరు:

పెద్దేముల్ మండలం తింసాన్‌పల్లి గ్రామానికి చెందిన మొల్లగాని రేణుక--లింగేష్ దంపతులు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించుకున్న నూతన ఇంటిలో శనివారం గృహప్రవేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లొంక నర్సింలు, ఎఫ్ఎన్‌సీఎస్ చైర్మన్ నల్ల ఎల్లారెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు హనీఫ్ హాజరై దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతన గృహ యజమానులు నాయకులను శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో మండల యూత్ ప్రెసిడెంట్ బోయిని మహేష్, కోటపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ డీవై నర్సింలు, మాజీ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ ఎండీ రియాజ్, ఎఫ్ఎన్‌సీఎస్ డైరెక్టర్ బుద్ధారం నాగేష్, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు పల్లె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



'సంజీవని వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్' పోస్టర్ ఆవిష్కరించిన డీజీ వీసీ సజ్జనార్

3 వేల మంది వాలంటీర్లతో 200లకు పైగా సేవా కార్యక్రమాలకు శ్రీకారం

ట్రస్ట్ సభ్యుల సామాజిక సేవలను అభినందించిన సజ్జనార్

ప్రజా వాయిస్ మెట్‌పల్లి:

మెట్‌పల్లి పట్టణానికి చెందిన యువకుడు ఎనుగందుల ఉదయ్ కుమార్ తన మిత్రులతో కలిసి స్థాపించిన 'సంజీవని వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్' పోస్టర్‌ను తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర మరియు పౌర రక్షణ విభాగం డీజీ వీసీ సజ్జనార్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న పలు సామాజిక సేవా కార్యక్రమాల వివరాలను సజ్జనార్ అడిగి తెలుసుకున్నారు. యువతను చైతన్యపరుస్తూ సమాజ సేవలో భాగస్వామ్యం చేయడాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎనుగందుల ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. 3,000 మందికి పైగా స్వచ్ఛంద సేవకుల (వాలంటీర్ల) సహకారంతో విద్య, వైద్యం, ఉపాధి, క్రీడలు, సాంస్కృతిక, పర్యావరణ, వన్యప్రాణి సంరక్షణ, వ్యవసాయం తదితర రంగాల్లో 200లకు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమపై నమ్మకంతో పోస్టర్ ఆవిష్కరణకు విలువైన సమయాన్ని కేటాయించిన డీజీ వీసీ సజ్జనార్‌కు, అలాగే సేవా కార్యక్రమాల్లో నిరంతరం సహకరిస్తున్న వాలంటీర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంజీవని వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గుంటుక సాగర్, శ్రీరాముల మహేష్, కటుకం శివకుమార్, రాచర్ల వివేక్, మగ్గిడి రవికుమార్, హిమాన్షు, మన్మత్ తదితరులు పాల్గొన్నారు.



కర్నాల్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన, జిల్లా కలెక్టర్

(ప్రజా వాయిస్) చేగుంట

చేగుంట మండలం కర్నాల్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పథకం యొక్క ప్రాముఖ్యత, కుటుంబాలకు జీవిత బీమా ద్వారా కలిగే ఆర్థిక భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి హిమ భార్గవి, ఎంపీడీవో టి. చిన్నారెడ్డి, ఎంపీవో ఏ. ప్రకాష్, తహసీల్దార్ బాలలక్ష్మి, ఏపీఎం దుర్గాప్రసాద్, గ్రామ సర్పంచ్ దుర్గాదేవి, ఉపసర్పంచ్ బాల శివ, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, మహిళా సంఘ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పుష్పలత, కుమార్, కృష్ణ, కంప్యూటర్స్, మండల ప్రజా పరిషత్ సిబంది పాల్గొన్నారు.

బీజేపీ మున్సిపల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా కొండపర్తి సంజీవ్ కుమార్...

- ఆర్ఎస్ఎస్ నుంచి ఏబీవీపీ వరకు.. తెలంగాణ ఉద్యమంలోనూ క్రియాశీల పాత్ర..

- రామగుండం ప్రజా సమస్యలపై పోరాటానికి గుర్తింపు

ప్రజా వాయిస్ గోదావరిఖని

విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమాల వరకు వివిధ దశల్లో క్రియాశీలంగా పనిచేస్తూ రాజకీయంగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న బీజేపీ నాయకుడు కొండపర్తి సంజీవ్ కుమార్‌కు పార్టీ జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించింది. బీజేపీ మున్సిపల్ సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా ఆయనను ఎంపిక చేసింది. ఈ నియామకంపై పార్టీ శ్రేణులు, ఉద్యమ సహచరులు, అభిమానులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్‌తో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన సంజీవ్ కుమార్, అనంతరం ఏబీవీపీలో విద్యార్థి నాయకుడిగా పనిచేశారు. విద్యార్థి సంఘం కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషించడంతో 'ఏబీవీపీ సంజీవ్'గా గుర్తింపు పొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పలు ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని కేసులను ఎదుర్కొన్నారు. అనంతరం రామగుండం ప్రాంతంలో ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ స్థానికంగా తనదైన గుర్తింపు సంపాదించుకున్నారు. జిల్లా మున్సిపల్ సెల్ కన్వీనర్‌గా సంజీవ్ కుమార్‌కు కీలక బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల పరిధిలోని సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. మున్సిపల్ పాలన విధివిధానాలు, అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, అవినీతి



ఆరోపణలు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై పార్టీ తరఫున గళమెత్తనున్నారు. పట్టణ ప్రాంతాల్లో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతో పాటు, మున్సిపల్ పాలనలో ప్రజల భాగస్వామ్యం, జవాబుదారీతనం పెంపొందించేలా కార్యాచరణ రూపొందించనున్నారు. మున్సిపల్ పరిధిలో పార్టీని మరింత విస్తరించడంతో పాటు, స్థానిక సమస్యలపై నిరంతరం పోరాటం సాగించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. త్వరలో రామగుండం, మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీలకు అధ్యక్షులు, పట్టణ కమిటీలతో పాటు జిల్లా కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

ప్రజా సమస్యలే నా ప్రాధాన్యం: సంజీవ్ కుమార్

ఈ సందర్భంగా కొండపర్తి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న తనకు బీజేపీ మున్సిపల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించడం సంతోషంతో పాటు మరింత బాధ్యతను పెంచిందన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ పదవులు అలంకారం కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశాలుగా భావిస్తానని, రామగుండం నుంచి మంథని వరకు జిల్లాలోని పట్టణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు. మున్సిపల్ పాలనలో ఎక్కడైనా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నా, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం కనిపించినా ప్రజల తరఫున ప్రశ్నిస్తానన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా, మున్సిపల్ పాలన పారదర్శకంగా సాగేందుకు పార్టీ తరఫున నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తానని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో మున్సిపల్ సెల్ కమిటీలను ఏర్పాటు చేసి, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేస్తానన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో తోడుగా నిలిచిన ఉద్యమ సహచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల సహకారంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని సంజీవ్ కుమార్ తెలిపారు. తనకు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించడంలో సహకరించిన గురుతుల్యులు మేరుగు హనుమంత్ గౌడ్‌తో పాటు శ్రేయోభిలాషులు కాశీపేట శివాజీ, కోమళ్ల మహేష్, గాండ్ల ధర్మపురి, కొమ్మల స్వామికి సంజీవ్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

సీఎం హామీతో మల్లన్నసాగర్ నిర్వాసితుల్లో కొత్త ఆశలు

- అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కృతజ్ఞతలు

- పునరావాస స్థలాలు, పెండింగ్ ప్యాకేజీలు, పరిహారాలు మంజూరు చేయాలి

- ఒంటరి మహిళలు, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ప్యాకేజీలు కల్పించాలి

- సీఎం హామీకి అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టాలి

- నిర్వాసితుల సాధన సమితి బాధ్యుడు బండ్ల స్వామి డిమాండ్

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :

మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని సిద్దిపేట పర్యటనలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ తమలో కొత్త ఆశలు చిగురింపజేసిందని నిర్వాసితుల సాధన సమితి బాధ్యుడు బండ్ల స్వామి అన్నారు. సీఎం ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వాసితులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ



సందర్భంగా బండ్ల స్వామి మాట్లాడుతూ.. భూసేకరణ సమయంలో అనేక హామీలు ఇచ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా నిర్వాసితులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేస్తూ, నిరంతరం పోరాటం సాగిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో పలువురు మంత్రులు, అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసి తమ సమస్యలను వివరించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సిద్దిపేట పర్యటన నేపథ్యంలో నిర్వాసితుల సమస్యలను వివరిస్తూ బహిరంగ లేఖ ద్వారా కూడా విన్నవించుకున్నామని తెలిపారు. తమ విజ్ఞప్తిపై స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. నిర్వాసితులకు అందాల్సిన పునరావాస స్థలాలు, పెండింగ్ నష్టపరిహారాలు, వివిధ ప్యాకేజీలతో పాటు ఒంటరి మహిళలకు, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు అందించాల్సిన ప్యాకేజీలను కూడా మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ కేవలం ప్రకటనకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని బండ్ల స్వామి డిమాండ్ చేశారు. జిల్లా అధికారులు నిర్వాసితుల వద్దకు వెళ్లి వారి సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీలు, పరిహారాలు, పునరావాస అంశాలపై సమగ్ర వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. ఏళ్ల తరబడి న్యాయం కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితుల సమస్యలను ఇకనైనా పరిష్కరించి, వారికి రావాల్సిన ప్రయోజనాలను వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జువ్వి రాంగోపాల్, బండ్ల కిషన్, దండే యాదగిరి, ఎర్రోళ్ల గణేష్, పెద్దమాతరి కనకరాజు, నాయిని లింగం, నేవూరి మల్లారెడ్డి, మ్యాదరి వెంకటేష్, జయాల మహేందర్, సందనమేని అంజనేయులు, అజ్మీర విజయకుమార్, గుగులోత్ గణేష్, గుగులోత్ నవీన్, గుల్ల వెంకటేష్ తదితర నిర్వాసితులు పాల్గొన్నారు.

పట్టాలు పేదలవి....పెత్తనం పెద్దలది

నార్సింగి సర్వే నంబర్ 205లో దళిత మహిళలకు కేటాయించిన స్థలాలపై ఆక్రమణ ఆరోపణలు

పట్టాలు ఉన్నా స్థలాలు స్వాధీనం కాని వైనం

రెండుసార్లు ఆర్డీవో ఆదేశించినా విచారణ నివేదిక పెండింగ్‌లోనే

ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పరిష్కారం శూన్యం

కలెక్టర్ జోక్యం చేసుకుని బాధిత మహిళకు న్యాయం చేయాలని కోరుతున్న మాజీ వార్డు సభ్యుడు దుడ్డు దేవేందర్

ప్రజావాయిస్॥ రాజేంద్రనగర్:

ప్రభుత్వ భూమిపై హక్కు కల్పిస్తూ పేదలకు పట్టాలు ఇచ్చారు. కానీ ఆ స్థలాల్లో మాత్రం లబ్ధిదారులకు హక్కు దక్కడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నార్సింగి గ్రామ పరిధిలోని గిరిగిరి గడ్డ సర్వే నంబర్ 205లో నిరుపేద దళిత మహిళలకు కేటాయించిన స్థలాలపై ఆక్రమణ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చేతిలో పట్టా ఉన్నా, కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేసుకోలేని పరిస్థితి బాధితులను ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపు,విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ ఆర్డీవో ఆదేశించినా రెవెన్యూ యంత్రాంగం నుంచి స్పందన లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆదేశాలు రెండుసార్లు - నివేదిక మాత్రం పెండింగ్

సర్వే నంబర్ 205లోని భూములపై విచారణ జరిపి మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని రాజేంద్రనగర్ ఆర్డీవో 2025 నవంబర్ 26న గండిపేట్ తహసీల్దార్‌ను ఆదేశించారు. గడువు ముగిసినా నివేదిక రాకపోవడంతో 2026 మేలో మరోసారి రిమైండర్ జారీ



నార్సింగి మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డికి

ఫిర్యాదు చేస్తున్న దుడ్డు దేవేందర్

చేశారు. తాజాగా నార్సింగి మాజీ వార్డు సభ్యుడు దుడ్డు దేవేందర్ ఫిర్యాదుతో మరోసారి తక్షణ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఈసారి జిల్లా కలెక్టర్‌కు కూడా ఆదేశాల ప్రతిని పంపించారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో విచారణ ఎంతవరకు వచ్చిందన్న దానిపై స్పష్టత లేకపోవడం రెవెన్యూ అధికారుల పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు.

పట్టాలు చేతిలో - స్థలాలు మాత్రం ఇతరుల ఆధీనంలోనా.?

ఈ భూముల్లో ప్లాట్ నంబర్ 32,సీరియల్ నంబర్ 127 కింద బి.పుష్పమ్మ పట్టా పొందారు. అయితే తనకు కేటాయించిన స్థలంలో ఇతరులు నిర్మాణాలు చేపట్టారని,ఇప్పటివరకు స్థలం స్వాధీనం కాలేదని ఆమె ఆరోపిస్తున్నారు. అలాగే ప్లాట్ నంబర్ 31, సీరియల్ నంబర్ 26 కింద పట్టా పొందిన డి.జ్యోతి సైతం తన స్థలాన్ని స్వాధీనం చేసుకోలేకపోతున్నానని, అడ్డంకులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టాలు పొందిన లబ్ధిదారులకే స్థలాలు దక్కకపోవడం,ఈ వ్యవహారంలో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

పట్టాల విక్రయాలపైనా ఆరోపణలు

గతంలో రాజేంద్రనగర్ మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఓ అధికారి హయాంలో అక్రమ పట్టాల వ్యవహారం చోటుచేసుకుందని దుడ్డు దేవేందర్ ఆరోపిస్తున్నారు. దళారుల ద్వారా ఒక్కో పట్టాను రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు విక్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో అధికారుల పాత్రతో పాటు దళారుల ప్రమేయంపైనా సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ జోక్యం చేసుకుంటేనే న్యాయం జరుగుతుందా.?



పేదలకు కేటాయించిన స్థలాలపై వచ్చిన ఆక్రమణ ఆరోపణలను అధికారులు ఇప్పటికైనా తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. సర్వే నంబర్ 205లో సమగ్ర భూసర్వే నిర్వహించి, పట్టాల ప్రామాణికతను పరిశీలించి, లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలను గుర్తించి స్వాధీనం చేయించాలని దుడ్డు దేవేందర్ జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. ఆక్రమణలు,అక్రమ పట్టాల ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వం పేదలకు ఇచ్చిన పట్టాలకు విలువ లేదా.? ఆర్డీవో ఆదేశాలకే స్పందన లేకపోతే బాధితులకు న్యాయం ఎలా జరుగుతుంది.? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా వినిపిస్తున్నాయి.

హరీష్‌రావుపై వ్యక్తిగత విమర్శలు సీఎం హోదాకు తగవు

- రాజకీయ విమర్శలు విధానాలు, పనితీరుకే పరిమితం కావాలి
- 420 హామీల్లో 10 శాతం కూడా నెరవేర్చలేదు
- ప్రాజెక్టులపై విమర్శలు మాని రైతులకు సాగునీరివ్వాలి
- రైతు బీమా విధానంలో మార్పులతో అర్హులకు అన్యాయం
- తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను విస్మరించొద్దు
- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :
రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలు చేయడం ముఖ్యమంత్రి హోదాకు తగదని ఎమ్మెల్సీ డా. వి. యాదవ రెడ్డి అన్నారు. రాజకీయ విమర్శలు నాయకుల విధానాలు, పనితీరుపైనే ఉండాలని, వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని హితవు పలికారు. సిద్దిపేటలో గురువారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్‌రావుపై చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిలో కనీసం 10 శాతం కూడా అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం తనకు ఇంకా రెండేళ్ల సమయం ఉందని చెబుతున్న నేపథ్యంలో, ఈలోగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ



నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులపై విమర్శలు చేయడం మానుకుని, వాటి ద్వారా రైతులకు సాగునీరు అందించడంపై దృష్టి సారించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటిని నింపకుండా రైతులు పంటల విరామం ప్రకటించే పరిస్థితులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. గతంలో అమలు చేసిన రైతు బీమా విధానంలో అర్హులైన రైతులకు ప్రయోజనం కల్పించగా, ప్రస్తుతం కుటుంబంలో ఒక్కరికే వర్తించేలా నిబంధనలు మార్చడం వల్ల అర్హులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. ప్రభుత్వ పథకాలకు ఇందిరమ్మ పేరు పెట్టడమే అభివృద్ధి కాదని, తెలంగాణ సాధన కోసం పోరాడిన అమరవీరులు, ఉద్యమకారులు, ప్రజా నాయకుల సేవలను కూడా గుర్తించాలని పేర్కొన్నారు. ఢిల్లీ పెద్దల మెప్పు కోసం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను విస్మరించవద్దని హితవు పలికారు. రాష్ట్రంలో పాలన, పెత్తనం, వసూళ్ల వ్యవహారాలపై ప్రజల్లో వ్యక్తమవుతున్న విమర్శలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రేవంత్‌రెడ్డి విమర్శలు చేసే తీరు, ఉపయోగించే భాషలో మార్పు కనిపించడం లేదని యాదవ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడుకుంటూ హుందాగా వ్యవహరించాలని సూచించారు. మిగిలిన రెండేళ్లలోనైనా ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత మరింత పెరుగుతుందని హెచ్చరించారు. సిద్దిపేట అభివృద్ధిలో హరీష్‌రావు పాత్రను, ప్రజలతో ఆయనకున్న అనుబంధాన్ని వ్యక్తిగత విమర్శలతో చెరిపివేయలేరని యాదవ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ పోరాటం ప్రజా సమస్యలు, విధానాల ఆధారంగానే జరగాలని, ముఖ్యమంత్రి హోదాను, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ హరీష్‌రావుపై చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

శస్త్ర చికిత్స వైద్యంలో అరుదైన ఘనత సాధించిన డాక్టర్ సోమశేఖర్
సుమారు రెండు కిలోల అండాశయ కణితిని తొలగించిన వైద్యులు
సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ ఆధ్వర్యంలో విజయవంతంగా ఆపరేషన్

ప్రజా వాయిస్ వరంగల్ వర్ధన్నపేట:
వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి వైద్య బృందం మరోసారి నిరూపించింది. ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్ సోమశేఖర్ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి వైద్యరంగంలో ప్రశంసలు అందుకున్నారు.వివరాల్లోకి వెళితే.. గుగులోతు శ్రీలత,అనే మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించగా అండాశయంలో సుమారు రెండు కిలోల బరువున్న బెజైన్ సిస్ట్ (అండాశయ కణితి) ఉన్నట్లు గుర్తించారు. దీంతో వైద్యులు పరిస్థితిని అంచనా వేసి అవసరమైన వైద్య ఏర్పాట్లు చేశారు. అనంతరం వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ పర్యవేక్షణలో సోమశేఖర్ వైద్య బృందం సమన్వయంతో శస్త్రచికిత్స చేపట్టి కణితిని విజయవంతంగా తొలగించారు.ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను ప్రభుత్వ ఆసుపత్రిలోనే విజయవంతంగా నిర్వహించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సిన



పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.ఈ సందర్భంగా శస్త్రచికిత్సలో భాగస్వాములైన డాక్టర్ సోమశేఖర్ తో పాటు వైద్యులు, డాక్టర్ అయేషా,అనస్థీషియా విభాగం డాక్టర్ ప్రత్యూష,సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, ఇతర వైద్య సిబ్బందికి మండల, పట్టణ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెంచేలా ఇలాంటి విజయవంతమైన శస్త్రచికిత్సలు మరిన్ని జరగాలని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంలో వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి మరింత ముందుకు సాగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

కుటుంబానికి ఆర్థిక భరోసా.. ఇందిరమ్మ బీమా!

హాలియాలో కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం
అర్హులైన లబ్ధిదారులకు బాండ్ పేపర్లు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

ప్రజా వాయిస్/అనుముల:
కుటుంబ పెద్దకు అనుకోని ఆపద ఎదురైనా ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని హాలియా మున్సిపాలిటీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, పథకానికి అర్హత పొందిన లబ్ధిదారులకు బీమాకు సంబంధించిన బాండ్ పేపర్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రేషన్ కార్డు కలిగిన అర్హులైన



కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కీలకమని పేర్కొన్నారు. కుటుంబ పెద్దకు ప్రమాదవశాత్తు ఏదైనా ఆపద సంభవించినప్పుడు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

వార్డుల వారీగా పంపిణీ కేంద్రాలు
లబ్ధిదారులకు సౌకర్యంగా ఉండేలా వార్డుల వారీగా బాండ్ పేపర్ల పంపిణీకి కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1, 2, 9వ వార్డులకు గ్రంథాలయంలో, 3, 4, 5వ వార్డులకు హాలియాలోని రైతు వేదికలో, 6, 7, 8వ వార్డులకు వి.బి.నగర్‌లోని బహదూర్ హాస్పిటల్ సమీపంలో, 10, 11, 12వ వార్డులకు అనుముల ప్రాథమిక పాఠశాలలో పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు, బొంగరాల యేసు రాజు, దీపావత్ ప్రసాద్ నాయక్, కౌన్సిలర్ల సలహాదారులు చిట్టిపోలు కరుణాసాగర్, నకిరేకంటి సైదులు, పిల్లి ఆంజనేయులు, కోఆప్షన్ సభ్యులు ఎండీ రషీద్, అడ్వకేట్ కొమ్మనబోయిన శేఖర్, మున్సిపల్ వార్డు అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల ప్రజా ప్రస్థానం..కోదాడలో చెరగని అభిమానం

ఘనంగా యెర్నేని వెంకట్ రత్నం బాబు జన్మదిన వేడుకలు
అభిమానుల కోలాహలం మధ్య కేక్ కట్
మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో కోదాడ అభివృద్ధికి మరింత కృషి చేస్తా: యెర్నేని బాబు

ప్రజా వాయిస్,కోదాడ:
ఐదు దశాబ్దాలుగా కోదాడ ప్రజలతో విడదీయలేని అనుబంధం.. పేదల పక్షాన నిలిచిన ప్రజా ప్రస్థానం.. రాజకీయ పదవులకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ప్రత్యేక గుర్తింపు.. ఇవే తన బలమని చాటుకుంటూ సాగుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యెర్నేని వెంకట్ రత్నం బాబు జన్మదిన వేడుకలు శుక్రవారం కోదాడలో అట్టహాసంగా జరిగాయి. పట్టణంలోని శకుంతల థియేటర్ వద్ద అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు, యెర్నేని యువసేన సభ్యులు భారీగా తరలివచ్చి జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా భారీ కేక్ ఏర్పాటు చేసి అభిమానుల కేరింతలు, చప్పట్ల మధ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు మాట్లాడుతూ యెర్నేని వెంకట్ రత్నం బాబు ఐదు దశాబ్దాలుగా కోదాడ రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రజల అభిమానాన్ని



చూరగొంటున్నారని పేర్కొన్నారు. సర్పంచ్‌గా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వివిధ హోదాల్లో పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి తనదైన కృషి చేశారని కొనియాడారు. పేదలకు అండగా నిలుస్తూ, సామాన్యులకు అందుబాటులో ఉండే నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. 'సినిమా హాల్ బాబు'గా ప్రజల్లో సుపరిచితుడైన ఆయన, పట్టుదలతో ఎంతటి క్లిష్టమైన పనినైనా పూర్తి చేసే వ్యక్తిగా అభిమానుల మన్ననలు పొందారని పేర్కొన్నారు. ఆయన మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..
అనంతరం యెర్నేని వెంకట్ రత్నం బాబు మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఐదు దశాబ్దాలుగా ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు తనకు కొండంత బలమని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో కోదాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలతో తనకున్న అనుబంధాన్ని ఎల్లప్పుడూ కొనసాగిస్తానని స్పష్టం చేశారు.అనంతరం తన సతీమణి, కోదాడ మున్సిపల్ చైర్మన్ యెర్నేని కుసుమతో కలిసి అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లీశ్వరి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యెర్నేని యువసేన సభ్యులు, రావెళ్ల కృష్ణారావు, లైటింగ్ ప్రసాద్, మైలారం శెట్టి భాస్కర్, కొండలు, పులి శ్రీను, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో ఈ నెల 23న కార్తీక దీపోత్సవం

వేడుకలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలి: హిందూ ఉత్సవ సమితి పిలుపు

బెల్లంపల్లి / ప్రజా వాయిస్
బెల్లంపల్లి: పట్టణంలో ఈ నెల 23వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు హిందూ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోడి రమేష్, అధ్యక్షుడు కంటెవాడ నగేష్ తెలిపారు. పట్టణంలోని ఏఎంసీ నంబర్-2 క్రీడా మైదానంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.శుక్రవారం క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తిభావంతో కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తారని తెలిపారు, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు.కార్తీక మాస పవిత్రతను చాటిచెప్పే ఈ దీపోత్సవంలో పట్టణ ప్రజలు, భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ ఉత్సవ సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు.,ఈ సమావేశంలో ఉత్సవ సమితి సభ్యులు సూరం లక్ష్మీనారాయణ, బాల సంతోష్, కట్ల అశోక్, పీక లక్ష్మణ్, కోడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పల్లవి ప్రోగ్రెసివ్ స్కూల్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం!

విద్యార్థులకు రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన..
మైనర్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి - ట్రాఫిక్ పోలీసుల సూచన
80 మంది విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన

శామీర్‌పేట్ / ప్రజా వాయిస్:
విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో శామీర్‌పేట్ మండలం తుమ్కుంటలోని పల్లవి ప్రోగ్రెసివ్ స్కూల్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కమిషనర్ శ్రీమతి సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్-1 డీసీపీ శ్రీ రాహుల్ రెడ్డి, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో ట్రిముల్గెరి ట్రాఫిక్ ఏసీపీ శ్రీ శంకర్ రాజు, ఆల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు ఐఎస్ఐ గుర్తింపు



కలిగిన హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కార్లలో ప్రయాణించేటప్పుడు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, లేన్ క్రమశిక్షణను అనుసరించడం, అతివేగాన్ని నివారించడం, వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం వంటి అంశాలను వివరించారు. అలాగే రాంగ్ సైడ్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకరమైన చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని, రోడ్డు భద్రతకు సంబంధించిన మంచి అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవాలని పోలీసులు పిలుపునిచ్చారు. అంతేకాకుండా తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి రోడ్డు భద్రతకు వారధులుగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది విద్యార్థులు చురుకుగా పాల్గొని ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన విలువైన విషయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ముగింపులో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, సురక్షిత ప్రయాణానికి కృషి చేయాలని, ప్రమాదాల నివారణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పోలీసులు పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత మనందరి బాధ్యత - ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. ప్రాణాలను కాపాడండి!

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ బీమా పథకం

రూ.8.30 కోట్లతో త్వరలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణం

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :
రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ జీవిత బీమా పథకం వర్తిస్తుందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు.సుల్తానాబాద్ మున్సిపాలిటీ పదో వార్డులో వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ బీమా పథకం ఆన్‌లైన్ విధానాన్ని ఆయన ప్రారంభించి పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు చూపుతో దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే పథకం లక్ష్యమన్నారు. త్వరలో వయోవృద్ధులకు కూడా పెన్షన్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రూ.8.30 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి నాలుగైదు రోజుల్లో భూమిపూజ చేయనున్నట్లు వెల్లడించారు.అనంతరం పదో వార్డులో నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించడంతో పాటు ప్రభుత్వ కళాశాల మైదానంలో కోకో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు తక్షణమే పెన్షన్ మంజూరు చేయాలి

బీసీ జేఏసీ గౌరవాధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న డిమాండ్..

ప్రజా వాయిస్, హుజురాబాద్ (నవంబర్ 20):

హుజురాబాద్ పట్టణంలోని స్థానిక పద్మాలయ క్లాత్ స్టోర్ ఆవరణలో జరిగిన బీసీ జేఏసీ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజక వర్గం బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో చేనేత కార్మికులకు మంజూరు చేయబడిన రుణాలను ప్రస్తుత ప్రభుత్వం అట్టి రుణాలను మాఫీ చేయడం చేనేత కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఉన్నటువంటి చిత్తశుద్ధిని తాము అభినందిస్తున్నామని పేర్కొన్నారు. చేనేత కార్మికులు చేనేత వృత్తినే నమ్ముకొని చాలీచాలని కూలీ డబ్బులతో కుటుం బాన్ని పోషించలేనటువంటి పరిస్థితిలో జీవనాన్ని కొన సాగిస్తున్నందున జియో ట్యాగింగ్ ద్వారా ఆన్లైన్లో నమోదు అయినటువంటి 50 సంవత్సరములు దాటిన చేనేత కార్మికులకు పెన్షన్ తక్షణమే మంజూరి చేస్తూ, వారికి తోడునీడగా ఉండాల్సినటువంటి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉన్నందున అర్హులైన చేనేత కార్మికులకు తక్షణమే పెన్షన్ మంజూరి చేసి చేనేత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా చేనేత సహకార సంఘాల మునుగడ పది కాలాల పాటు కొనసాగింపునకు యారన్ కు సంబంధించి సబ్సిడీని మంజూరు చేసి చేనేత సహకార సంఘాలకు ఆదుకోవడంతోపాటు చేనే తకు చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, తాటి పాముల కనకయ్య, మంచి కట్ల విజయకుమార్, ఆళ్ల కేశవులు, రాజన్న, సంతోష్, బాబర్, ప్రజా సంఘాల నాయకులు తునికి సమ్మయ్య, గరు బుచ్చయ్య, పోగు సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



పేద కుటుంబాలకు అండగా ఇందిరమ్మ జీవిత బీమా

కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి ఆర్థిక భద్రతే లక్ష్యం

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

ప్రజావాయిస్॥శంషాబాద్:

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభమైంది. శంషాబాద్ మండలం పాల్మాకుల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కుటుంబ యజమాని మరణించినప్పుడు,ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అండగా నిలవడమే ఈ పథకం ఉద్దేశమని తెలిపారు. పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు,వారి జీవనానికి భరోసా ఇవ్వడంలో ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎంపీడీవో,తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐవో ఆకస్మిక తనిఖీ

విద్యార్థుల ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా అధ్యాపకులు పనిచేయాలి

జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

శ్రీరంగాపూర్ నవంబర్ 20 ప్రజా వాయిస్

ఇంటర్మీడియట్ అధికారి రాంపాక అవిలయ్య శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, సిలబస్ పూర్తి, ప్రయోగశాలల నిర్వహణ, ప్రాక్టికల్ తరగతులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అధ్యాపకులు సకాలంలో సిలబస్ పూర్తి చేసి, విద్యార్థులకు ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ తనిఖీ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ ఇ.జె. మోజెస్ వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీనా..?ప్రైవేట్ వేడుకల వేదికనా?

- **ప్రజా సమస్యలు పక్కనపెట్టి పుట్టినరోజు సంబరాలా?**
- **ప్రభుత్వ కార్యాలయాన్ని వ్యక్తిగత వేడుకలకు వినియోగించడంపై విమర్శలు.**
- **కోదురుపాక పాలకవర్గం తీరుపై బుసనవేని మహేందర్ ఆగ్రహం.**
- **ఎంపీడీవోకు ఫిర్యాదు.. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్.**

ప్రజా వాయిస్ పెద్దపల్లి

గ్రామ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన గ్రామపంచాయతీ కార్యాలయం వ్యక్తిగత వేడుకలకు వేదికగా మారిందా? ప్రజాధనంతో నిర్వహించే ప్రభుత్వ కార్యాలయాలను వ్యక్తిగత సంబరాలకు ఉపయోగించుకోవడమే పాలకవర్గం బాధ్యతగా భావిస్తోందా? కోదురుపాక గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించడంపై ఇలాంటి ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 19న గ్రామ ఉపసర్పంచ్ పుట్టినరోజు వేడుకలను సర్పంచ్ ఆధ్వర్యంలో స్వయంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించడంపై గ్రామానికి చెందిన బుసనవేని మహేందర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ. గ్రామపంచాయతీ కార్యాలయం అంటే ప్రజల ఆస్తి అని, అది ఏ ఒక్కరి వ్యక్తిగత సొత్తు కాదని స్పష్టం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యలు, పారిశుధ్యం, డ్రైనేజీ,



వీధిలైట్లు, అంతర్గత రహదారులు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన పాలకవర్గం వ్యక్తిగత వేడుకలకు కార్యాలయాన్ని ఉపయోగించుకోవడం ఏమిటని ప్రశ్నించారు.? గ్రామపంచాయతీ కార్యాలయం ప్రజల సమస్యలు వినే వేదికగా ఉండాలి కానీ పుట్టినరోజు వేడుకలు, విందులు, వినోదాలకు వేదికగా మారకూడదన్నారు. గ్రామాభివృద్ధికి కేటాయించిన సమయం, వనరులు ప్రజల అవసరాలకే ఉపయోగపడాలని, పాలకవర్గం బాధ్యతలను గుర్తించి పనిచేయాలని హితవు పలికారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ పెద్దగా పట్టించుకోలేదని, ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల వినియోగంపై ప్రశ్నించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వినియోగానికి సంబంధించిన నిబంధనలు ఏమిటి? ఎవరి అనుమతితో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేయగా, అధికారులు స్వీకరించి రసీదు అందజేశారని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని మహేందర్ తెలిపారు. సోమవారం నిర్వహించే ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఈ అంశంపై ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామపంచాయతీ అంటే పుట్టినరోజు కేకులు కట్ చేసే వేదిక కాదు.. గ్రామ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే ప్రజా పాలనా కేంద్రం. ప్రజల అవసరాల కంటే వ్యక్తిగత వేడుకలకే ప్రాధాన్యత ఇస్తే గ్రామాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? అని మహేందర్ ప్రశ్నించారు.? ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



గద్దర్ ఆశయాల సాధనే మనందరి లక్ష్యం

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే ప్రజా యుద్ధనౌక గద్దర్

డాక్టర్ వెన్నెల గద్దర్

గద్దర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తాను

గద్దర్ ఆశయాలు పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

రాష్ట్ర సంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి ప్రజా యుద్ధనౌక గద్దర్ అని తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్ అన్నారు.ఆయన తన పాటలతో ప్రజల్లో చైతన్యం నింపి, ఎన్నో ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో గురువారం మాజీ దళ కమాండర్ ఎత్తం కృష్ణన్న ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు, దివంగత గద్దర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వెన్నెల గద్దర్, బహుజన మేధావి



జీబీ రాజు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

మీసాల రామన్న పాట ఆవిష్కరణ ప్రత్యేక ఆకర్షణ

ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ ఉద్యమకారుడు, గద్దర్ అభిమాని మీసాల రామన్న రచించి, స్వయంగా గానం చేసిన “పాటమ్మ నీకు వందనం గద్దరన్న మీకు దూరమాయనమ్మ” అనే పాటను డాక్టర్ వెన్నెల గద్దర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాట రచన, గానం చేసిన మీసాల రామన్నను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం నిర్వహించిన సభలో డాక్టర్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ,,, ప్రజా యుద్ధనౌక గద్దర్ తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన గొప్ప ప్రజా నాయకుడని అన్నారు. తన పాటల ద్వారా ప్రజా సమస్యలను ప్రపంచానికి వినిపిస్తూ, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. ఆయన కళా ప్రస్థానం, ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.గత ప్రభుత్వం గద్దర్ సేవలను, ఆయన గొప్పతనాన్ని తగిన రీతిలో గుర్తించలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గద్దర్ పేరుతో నంది అవార్డులను ఏర్పాటు చేసి ఆయన కళా, సాంస్కృతిక సేవలను గౌరవిస్తోందని తెలిపారు.వీపనగండ్ల మండల కేంద్రంలో గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన ఎత్తం కృష్ణన్నను ప్రత్యేకంగా అభినందించారు.అదేవిధంగా గద్దర్‌పై అద్భుతమైన పాటను రచించి, స్వయంగా ఆలపించిన మీసాల రామన్నను ప్రశంసించారు. గద్దర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా మరిన్ని పాటలు రావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ,,, గద్దర్ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఆయన పాటలు ప్రజల్లో చైతన్యాన్ని రగిలిస్తూ ఎప్పటికీ స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

ప్రగతినగర్ అంబీర్ చెరువు అభివృద్ధికి శ్రీకారం

120 ఎకరాల్లో మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు భూమిపూజ.. త్వరలో పనులు ప్రారంభం

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువు అభివృద్ధి పనులకు శుక్రవారం ఉదయం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. శంషీగూడలోని అయ్యప్పస్వామి దేవాలయం పరిసర ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ, హైడ్రా కమిషనర్ రంగనాథ్ పాల్గొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ప్రగతినగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆలేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోలన్ హనుమంత్ రెడ్డి చేసిన నిరంతర కృషి, పలుమార్లు అందించిన సిఫారసు లేఖలు, ప్రగతినగర్ కాలనీవాసులు, ప్రగతినగర్ పరిరక్షణ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చేసిన విజ్ఞప్తుల ఫలితంగానే అంబీర్ చెరువు



అభివృద్ధికి మార్గం సుగమమైందని తెలిపారు.సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అంబీర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు హైడ్రా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువులోని కలుషిత నీటిని బయటకు పంపించే ప్రక్రియ కొనసాగుతోందని, నీటిని పూర్తిగా తొలగించిన అనంతరం పది రోజుల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని హైడ్రా అధికారులు వెల్లడించినట్లు తెలిపారు.చెరువు అభివృద్ధితో ప్రగతినగర్, శంషీగూడ పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి రావడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అంబీర్ చెరువు అభివృద్ధికి చొరవ చూపిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు, హైడ్రా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేసిన ప్రజానాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ప్రగతినగర్ కాలనీవాసుల తరఫున ఆలేటి శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోండి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి: జడ్జి ఎం.డి. ఉమర్

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 20 :

విద్యార్థులు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.డి. ఉమర్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో కోదాడ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మందుల రూపంలో వైద్యుల సూచనల మేరకు వినియోగించే ఔషధాలు వేరు, నిషేధిత మాదకద్రవ్యాలు వేరని వివరించారు. గంజాయి, కొకైన్ వంటి నిషేధిత మాదకద్రవ్యాలను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.అలాగే సెల్‌ఫోన్‌ల వినియోగానికి పరిమితులు విధించుకోవాలని, వాటిలోని మంచి విషయాలను మాత్రమే గ్రహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని, దానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని తెలిపారు.కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, న్యాయ సలహా కేంద్రం సభ్యులు నాగుల్ పాషా, ఉయ్యాల నరసయ్య, పాఠశాల కరస్పాండెంట్ నెల్లూరు



సత్యనారాయణ, చిలుకూరు న్యాయవాది ఖన్నం సాహెబ్, చిలుకూరు ఏఎస్ఐ పోతులూరి చారి, పాఠశాల కరస్పాండెంట్ నెల్లూరీ సాయి శ్రియ, పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ షరీఫ్, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి శుక్రవారం - గంగాస్నానానికి విశేష ప్రాధాన్యం

గంగమ్మ దయ ఉంటే అన్నీ మంచే

అమ్మ కాలం నుంచి ఇదే ఆచారం

గంగమ్మను నమ్మి ప్రతి ఏటా వస్తున్నాం

చలిలో స్నానం - మనసుకు ప్రశాంతత





పెరుగు కమల,కనికి గ్రామం



తులసి రామ్, కనికి గ్రామం

ప్రజా వాయిస్, కొమరం భీం ఆసిఫాబాద్, కౌటాల

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలో కార్తిక మాసం తొలి ఏకాదశి శుక్రవారం రోజున రావడంతో ఆ రోజుకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. కార్తిక మాసంలో ఏ రోజు స్నానం చేసినా గంగాస్నాన ఫలితం వస్తుందని, అందులోనూ తొలి ఏకాదశి శుక్రవారం రోజున స్నానం చేస్తే మరింత మంచిదని భక్తులు నమ్ముతున్నారు.కౌటాల లోని దొంగ స్థానం వద్ద శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు గంగాస్నానం చేసి, దీపాలు వెలిగించి గంగమ్మకు మొక్కుకున్నారు.

ఈ రోజు ప్రత్యేకం

కార్తిక మాసం విష్ణుమూర్తికి ఎంతో ఇష్టమైన మాసం. ఏకాదశి తిథి విష్ణుమూర్తికి ప్రీతికరం. శుక్రవారం లక్ష్మీదేవికి ప్రీతికరం. ఈ రెండూ ఒకే రోజు కలవడం వల్ల ఈ తొలి ఏకాదశి శుక్రవారానికి ఎంతో విశిష్టత వచ్చిందని పెద్దలు చెబుతున్నారు. అందుకే ఈ రోజున గంగాస్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయని, మనసు ప్రశాంతంగా ఉంటుందని, ఇంట్లో సుఖశాంతులు కలుగుతాయని భక్తుల నమ్మకం.కౌటాల మండలం పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడిన ప్రాంతం కావడంతో భక్తులు తమ పంట బాగా పండాలని, ఇంట్లో కష్టాలు తొలగిపోవాలని, పిల్లల చదువులు బాగుండాలని, కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని గంగమ్మను వేడుకున్నారు. కార్తిక మాసంలో నెల రోజుల పాటు ఎంతో మంది ఉపవాసాలు, దీపారాధనలు చేస్తారు. అందులో తొలి ఏకాదశి అంటే మరింత పవిత్రమైన రోజుగా భావిస్తారు.

తెల్లవారుజామునే స్నానాలు

శుక్రవారం ఉదయం తెల్లవారుజామునే భక్తులు దొంగ స్థానం వద్దకు చేరుకున్నారు. చలిని లెక్కచేయకుండా గంగలో మూడు సార్లు మునిగి గంగమ్మకు నమస్కరించారు. స్నానం చేసిన తర్వాత ఒడ్డున కూర్చుని కొంతసేపు భగవంతుని నామస్మరణ చేసుకున్నారు. స్నానం అనంతరం దొంగ స్థానం వద్ద దీపాలు వెలిగించి, ఇంట్లో సుఖశాంతులు కలగాలని వేడుకున్నారు. అనంతరం ప్రశాంతంగా ఇళ్లకు తిరిగి వెళ్లారు. ఈ రోజున స్నానం చేసిన భక్తులు రోజంతా భక్తి భావంతో గడిపారు.

దీపాలు వెలిగించి మొక్కులు

గంగాస్నానం చేసిన తర్వాత భక్తులు దొంగ స్థానం వద్ద దీపాలు వెలిగించారు. గంగమ్మకు పసుపు, కుంకుమ, పూలు సమర్పించారు. తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దలు చెప్పిన ఆచారాల ప్రకారం నడుచుకున్నారు. ఈ సంప్రదాయం తరతరాలుగా కౌటాల ప్రాంతంలో కొనసాగుతూ వస్తోందని భక్తులు తెలిపారు.

ప్రతి ఏటా చేస్తున్నాము - చేస్తే మంచిది

మేము ప్రతి ఏటా దొంగ స్థానం వద్దకు వచ్చి గంగాస్నానం చేస్తున్నాము. కార్తిక మాసంలో తొలి ఏకాదశి శుక్రవారం రోజున స్నానం చేస్తే మరింత మంచిదని మా పెద్దలు చెప్పారు. ఈ రోజు స్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయని, మనసు ప్రశాంతంగా ఉంటుందని మా నమ్మకం. మా ఇంట్లో కష్టాలు పోవాలని, మా పిల్లలు బాగా చదువుకోవాలని, మా కుటుంబం సుఖంగా ఉండాలని గంగమ్మను వేడుకున్నాం.చలి ఉన్నా సరే తెల్లవారుజామునే వచ్చి స్నానం చేస్తాం. స్నానం చేసిన తర్వాత దొంగ స్థానం వద్ద దీపం పెట్టి ఇంటికి వెళతాం. ఇదే మాకు ప్రతి ఏటా అలవాటు. మా అమ్మ కాలం నుంచి మేము ఇలాగే చేస్తున్నాము. గంగలో మునిగిన తర్వాత మనసులో ఉన్న బాధ అంతా పోయినట్లు అనిపిస్తుంది. మనసు తేలిక అవుతుంది. గంగమ్మ దయ ఉంటే మాకు అన్నీ మంచే జరుగుతాయని మేము గట్టిగా నమ్ముతున్నాం. మా పిల్లలకు కూడా ఇదే సంప్రదాయం నేర్పిస్తున్నాం.

- పెరుగు కమల,కనికి గ్రామం

పాపాలు తొలగిపోతాయి -పంట బాగా పండుతుంది

నేను ప్రతి సంవత్సరం కార్తిక మాసంలో గంగాస్నానం చేస్తాను. ముఖ్యంగా తొలి ఏకాదశి శుక్రవారం రోజున స్నానం చేస్తే మరింత మంచిది. గంగలో మునిగితే మనసులో ఉన్న భయం పోతుంది. పాపాలు తొలగిపోతాయి. మనసు తేలిక అవుతుంది.మా పంట బాగా పండాలని, మా కాయలు నిలబడాలని, మా ఇంట్లో ఏ కష్టం రాకూడదని గంగమ్మను వేడుకున్నాను. చలిలో వచ్చి స్నానం చేస్తే కష్టం అనిపించినా, స్నానం చేసిన తర్వాత మనసు చాలా ప్రశాంతంగా ఉంటుంది. గంగమ్మ దయ ఉంటే మాకు అన్నీ మంచే జరుగుతాయి. అందుకే ప్రతి ఏటా తప్పకుండా వచ్చి స్నానం చేస్తాను. రైతులమైన మాకు పంటే జీవితం. పంట బాగుంటే ఇంట్లో అన్నీ బాగుంటాయి. అందుకే గంగమ్మను నమ్మి ప్రతి ఏటా వస్తున్నాం.

- తులసి రామ్,కనికి గ్రామం

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం శిబిరాల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు తావు ఉండకూడదు:లి లిజిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



చిట్యాల గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా శిబిరాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం శిబిరాల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం ఉండకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శుక్రవారం నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బీమా నమోదు తీరును పరిశీలించారు. బీమా నమోదు ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బీమా చేయు వ్యక్తి పేరు, నామినీ వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని అన్నారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పులు చేయకూడదన్నారు. ప్రక్రియ పూర్తి చేసిన వారి వివరాలు రిజిస్టర్ లో స్పష్టంగా పొందుపరిచాలని చెప్పారు. బీమా నమోదు ప్రక్రియలో ఏవైనా సాంకేతికపరమైన ఇబ్బందులు కలిగితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు.55 ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. శిబిరాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ తనిఖీలో తహసీల్దార్ ప్రభాకర్, ఎంపిడిఓ సుధాకర్, సర్పంచ్ సుప్రియ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

భూగర్భ జలాల పెంపుతోనే గ్రామాల్లో కరువు నివారణ

భావితరాలకు నీటి భద్రత కల్పించడమే జలసిరి లక్ష్యం..

వేల్పుగొండలో జలసిరిపై గ్రామసభ



ప్రజా వాయిస్ టేక్మాల్,

భూగర్భ జలాలను పెంపొందించి, కరువు పరిస్థితులను అధిగమించడంతో పాటు భావితరాలకు నీటి కొరత లేకుండా చేయడమే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలసిరి పథకం ప్రధాన లక్ష్యమని టేక్మాల్ మండల ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో నిర్వహించిన జలసిరి గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, మహిళలు, కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణం చేపట్టవచ్చని తెలిపారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం తక్కువగా ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రైతులు తమ పొలాల్లో నీటి కుంటలు, వ్యవసాయ కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవడంతో పాటు బోరుబావుల రీఛార్జ్ పనులు చేపట్టాలని కోరారు. తద్వారా భూగర్భ జలమట్టం పెరిగి నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించి రైతులు అదనపు ఆదాయం పొందాలని సూచించారు.గ్రామంలో పారిశుద్ధ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ప్రతి ఇంటి ముందు రెండు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. జలసిరి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్తులు, అధికారులతో కలిసి నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిరుడి దాస్, ఉపసర్పంచ్ ఎంపీ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, ఏపీవో పాలు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఏఈఓ సుభాష్, గ్రామ పాలన అధికారి సురేష్, ప్రభుత్వ పశువైద్యశాల సిబ్బంది అమృత, ఫీల్డ్ అసిస్టెంట్ ఓంప్రకాష్, విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు కవిత, సంగమణి, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశా వర్కర్ దివ్య, వార్డు సభ్యులు దేవసాయం, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఖలీల్ మీర్జాబేగ్‌పై రౌడీషీట్ తెరవాలి

పీడీ యాక్ట్ అమలు చేయాలి

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ డిమాండ్

బెల్లంపల్లి, /ప్రజా వాయిస్

దళిత కాంగ్రెస్ నాయకులపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన బీఆర్ఎస్ నాయకుడు ఖలీల్ మీర్జాబేగ్‌పై రౌడీషీట్ తెరిచి, పీడీ యాక్ట్ అమలు చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ డిమాండ్ చేశారు.శుక్రవారం బెల్లంపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్సీ సెల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చేయూత పెన్షన్ల ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాంపల్లి శ్రీనివాస్, కాంపల్లి సతీష్‌లపై ఖలీల్ మీర్జాబేగ్, అతని అనుచరులు దాడి చేసి, కులం పేరుతో దూషించారని ఆరోపించారు. ఈ ఘటనపై ఇప్పటికే బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడికి పాల్పడిన వారిని సమర్థిస్తూ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు,ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ పాముల వెంకటేష్, జిల్లా అధికార ప్రతినిధులు కాసర్ల యాదగిరి, సుద్దాల రాజ్‌కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

డేటా సెంటర్ వద్దు.. షాబాద్ - షాద్‌నగర్ ముద్దు

టీఆర్ఎస్ రక్షణ సేన రాష్ట్ర నాయకులు ఎండీ ముస్తఫా

ప్రజల ప్రాణాలతో చెలగాటమా అభివృద్ధి పేరుతో రైతులు పశువుల ఆరోగ్యానికి ముప్పు తెస్తారా

వెంటనే డేటా సెంటర్‌ను పనులని నిలిపివేసి మరో ప్రాంతానికి తరలించాలి డిమాండ్

(ప్రజా వాయిస్ షాబాద్)

షాద్‌నగర్,షాబాద్ ఎలకట్ట ప్రాంతాల్లో ప్రతిపాదిత డేటా సెంటర్ ఏర్పాటును నిలిపివేయాలని టీఆర్ఎస్ రక్షణ సేన రాష్ట్ర నాయకులు ఎండీ ముస్తఫా ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో పలు పరిశ్రమలు, కంపెనీలు ఉండటంతో కాలుష్య సమస్యలు పెరిగాయని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎండీ ముస్తఫా మాట్లాడుతూ.. ఇప్పటికే పరిశ్రమల కారణంగా పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు మరో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. డేటా సెంటర్ నిర్వహణకు భారీగా నీరు అవసరమయ్యే అవకాశం ఉన్నందున భూగర్భ జలాలపై ప్రభావం పడుతుందని, దీనివల్ల రైతులు, వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు అలాగే పశువులు, పంటలు, పర్యావరణంపై ప్రభావం పడుతుందనే భయాలు స్థానిక ప్రజల్లో ఉన్నాయని తెలిపారు.అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న షాద్‌నగర్ నియోజకవర్గానికి మంచి పరిశ్రమలు, స్థానికులకు ఉపాధి కల్పించే సంస్థలు రావాలని తాము కోరుకుంటున్నామని, అయితే ప్రజల ఆరోగ్యం, రైతుల భవిష్యత్తుకు ముప్పు కలిగించే ప్రాజెక్టులు వద్దని స్పష్టం చేశారు. ఈ డేటా సెంటర్‌ను మరో ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ప్రజల ఆరోగ్యం, భూగర్భ జలాలు, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ ఏర్పాటును నిలిపివేయాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఎండీ ముస్తఫా హెచ్చరించారు.



విద్యార్థులకు విద్యుత్ తో పాటు క్రీడాలు ప్రాముఖ్యత

ఎంఈఓ నీరజ

ప్రజా వాయిస్ చేగుంట /

జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ఆదేశం మేరకు శుక్రవారం చేగుంట మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందినటువంటి విద్యార్థులకు స్థానిక మోడల్ స్కూల్లో క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది . ఈ క్విజ్ పోటీల్లో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి కే ప్రణవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరీంనగర్, 9వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి మహాలక్ష్మి మోడల్ స్కూల్ చేగుంట, 8వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి కే శివాని జడ్.పి.హెచ్.ఎస్ కరీంనగర్ కి మండల విద్యాధికారి నీరజ మరియు క్విజ్ ఇంచార్జ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బోనాల కృష్ణారావు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నీరజ మాట్లాడుతూ క్విజ్ పోటీల నిర్వహించడం వల్ల విద్యార్థుల్లోని విజ్ఞానాన్ని వెలికి తీయవచ్చు అని, విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని, భవిష్యత్తులో ఉద్యోగాలు సాధించడానికి చక్కటి అవకాశం గా ఉంటుందని అన్నారు.మండల స్థాయిలో విజేతలుగా నిలిచినటువంటి విద్యార్థులకు జిల్లా స్థాయిలో 26 తారీకు నాడు సెమీఫైనల్స్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రకళ మరియు క్విజ్ మాస్టర్లుగా రావుల వెంకటేష్, శ్రీనివాస్, దేవరాజ్, మరియు టెక్నికల్ ఆఫీసర్స్ గా చరణ్ దాస్, పులి రమేష్, సంతోష్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్స్ చల్లా లక్ష్మణ్, గందే పాండు, ప్రభాకర్, మహేందర్ రెడ్డి, యాదగిరి, వీణ, సంధ్యారాణి, రాజశేఖర్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.





మంత్రి వాకిటి శ్రీహరికి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

హనుమకొండ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు మరియు యువజన సేవల శాఖ మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి కి ఐనవోలు మండలం పున్నెల క్రాస్ వద్ద వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి కి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. వారి వెంట ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి , రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు , రాష్ట్ర టెస్కాబ్ మాజీ చైర్మెన్ మార్నేని రవీందర్ రావు , వరంగల్ డీసీసీ అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్ ,మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



వీసీ కుర్చీకి సెగ”తొలగించే వరకు పోరాటం

తేజశ్రీ ఫిర్యాదు నేపథ్యంలో ఆల్దాస్ జానయ్యపై

ఉద్యోగులు,అధ్యాపకులు, విద్యార్థుల ఆగ్రహం

తక్షణమే పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ

ధర్నాకు దిగిన,ఉద్యోగులు, అధ్యాపకులు,విద్యార్థులు

ప్రజావాయిస్॥రాజేంద్రనగర్

:ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వీసీ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్యకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తమైంది. అధ్యాపకురాలు తేజశ్రీ చేసిన లైంగిక వేధింపుల ఫిర్యాదు నేపథ్యంలో వీసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా)బోధనేతర ఉద్యోగుల సంఘం, విద్యార్థులు సంయుక్తంగా విశ్వవిద్యాలయంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. తేజశ్రీ ఫిర్యాదు నేపథ్యంలో వీసీ తన పదవీ అధికారాలను ఉపయోగించి అధ్యాపకులు,బోధనేతర ఉద్యోగులు,విద్యార్థులపై వివిధ రూపాల్లో ఒత్తిడి తెస్తూ వారిని ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.ఈ పరిణామాలు విచారణ పారదర్శకతపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిగేలా వీసీని తక్షణమే బాధ్యతల నుంచి తప్పించాలని,రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో టాసా అధ్యక్షుడు డా.కె.పవన్ చంద్రారెడ్డి, కమలాకర్,ప్రశాంత్, సత్యమూర్తి,కామ్రేడ్, రాజ్‌కుమార్,తేజశ్రీ,రాజు, జైరాం,పరమేశ్‌తో పాటు పలువురు అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేత

ప్రజావాయిస్/వికారాబాద్:

వికారాబాద్ మండలం మైలార్ దేవరంపల్లి గ్రామానికి చెందిన చెల్క సుధాకర్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని గ్రామ ఉపసర్పంచ్ మాడపు వసంత బస్వలింగం అన్నారు. విషాదంలో ఉన్న బాధిత కుటుంబానికి వడ్ల నందు ఫౌండేషన్ చైర్మన్ వడ్ల నందు తన వంతు సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వసంత బస్వలింగం, శ్రీనివాస్ రెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడమే ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు.



పాత కక్షలతో దాడులు.. ముగ్గురికి 14 రోజుల రిమాండ్!

కొత్త కోల్‌కుందాలో బెదిరింపులు..

దాడికి పాల్పడిన నిందితులపై పోలీసుల చర్య

ప్రజావాయిస్ / మోమిన్‌పేట్

పాత కక్షలు, ఎన్నికల నాటి గొడవలతో గ్రామంలో అశాంతి సృష్టిస్తే చట్టం చూస్తూ ఊరుకోదు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం కొత్త కోల్‌కుందా గ్రామంలో గొల్ల మల్లేశంను చంపేస్తామని బెదిరించి, వెంబడించి దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.టప్ప ఖాజా పాషా, టప్ప షాబుద్దీన్, రావులపల్లి మహేందర్ రెడ్డిలకు వికారాబాద్ అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో వారిని జిల్లా కారాగారానికి తరలించారు.పాత కక్షలతో గ్రామాల్లో గొడవలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారికి చట్టపరమైన చర్యలే గట్టి సమాధానం!



వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దుపీ హెచ్ సి ని తనిఖీ చేసిన ఏజెన్సీ డీఎంహెచ్‌వో

సిబ్బందికి పలు సూచనలు

ఏజెన్సీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్

ప్రజా వాయిస్,కొత్తగూడ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఏజెన్సీ డీఎంహెచ్‌వో (ఐటీడీఏ) క్రాంతికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వరుణ్‌కు పలు కీలక సూచనలు చేశారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో వైద్య ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.



ఖేలో ఇండియా జాతీయ యువజన క్రీడల లోగో, మస్కట్ ఆవిష్కరణ

జిల్లాలో క్రీడలపై విస్తృత ప్రచారం చేపట్టాలి - కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రజా వాయిస్,మహబూబాబాద్

జిల్లా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న 8వ ఎడిషన్ ఖేలో ఇండియా జాతీయ యువజన క్రీడలు--2026కు సంబంధించి లోగో, మస్కట్ గోడపత్రికలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు.రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు హైదరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, కరీంనగర్ పట్టణాల్లో జాతీయ యువజన క్రీడలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి క్రీడలపై జిల్లాలోని యువత, క్రీడాకారులకు అవగాహన కల్పించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని క్రీడా ప్రాంగణాలు, బస్‌స్టాండ్లు, ప్రధాన కూడళ్ల వద్ద ఖేలో ఇండియా క్రీడలకు సంబంధించిన లోగో, మస్కట్ కటౌట్లు, బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేసి ప్రజల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఓలేటి జ్యోతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదం

ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా.. రైతు మృతి

కుటుంబంలో విషాదఛాయలు

ప్రజా వాయిస్ / మునుగోడు:



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఓ రైతు ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామంలో చోటుచేసుకుంది.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊకొండి గ్రామానికి చెందిన చందపాక లింగస్వామి (50) తన వ్యవసాయ భూమిలో పొలంను ట్రాక్టర్‌తో సాగుచేస్తుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద చిక్కుకుని తీవ్రంగా గాయపడిన లింగస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఒక కుమార్తె ఇద్దరు కుమారులు కలిగి ఉన్నారు.కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న లింగస్వామి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి ఆయన మరణం తీరని లోటుగా మారింది. కుటుంబ పోషణకు ఆధారమైన వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.ఈ విషాద ఘటనతో ఊకొండి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి పోస్ట్ మార్ట్ నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ తరలించినట్లు ఎస్ఐ కె శోభన్ బాబు తెలిపారు.



శాంతిఖని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హాకు ఘన వీడ్కోలు

నూతన మేనేజర్‌గా లక్కాకుల మహేష్ బాధ్యతల స్వీకరణ

బెల్లంపల్లి, /ప్రజా వాయిస్

బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని బొగ్గు గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా బదిలీ నేపథ్యంలో శుక్రవారం గని ఆవరణలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గని అధికారులు, కార్మికులు ఆయనకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. 2021 ఆగస్టు 21న శాంతిఖని మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సంజయ్ కుమార్ సిన్హా ఐదేళ్లకు పైగా గనిలో సేవలందించారు. కార్మికులు, అధికారులతో కలివిడిగా ఉంటూ అందరి మన్ననలు పొందిన ఆయన ఒక్కసారిగా బదిలీ కావడంతో కార్మికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం ఆయనను కొత్తగూడెంలోని జీఎం కార్యాలయానికి బదిలీ చేసింది.అనంతరం శాంతిఖని నూతన మేనేజర్‌గా నియమితులైన లక్కాకుల మహేష్‌కు అధికారులు, కార్మికులు స్వాగతం పలికారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో రక్షణాధికారిగా విధులు నిర్వహించిన మహేష్ తాజాగా శాంతిఖని మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఈ వీడ్కోలు, స్వాగత కార్యక్రమంలో శాంతిఖని ప్రాజెక్టు అధికారి ఎస్. సంతోష్ కుమార్, గని అధికారులు, కార్మికులు పాల్గొని సంజయ్ కుమార్ సిన్హా సేవలను కొనియాడారు. నూతన మేనేజర్ లక్కాకుల మహేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



పాత జ్ఞాపకాలు.. కొత్త వెలుగులు..

తాము చదివిన బడికి పూర్వ విద్యార్థుల రూ.26 వేల విరాళం..

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 20 :

తాము చదివిన పాఠశాలను మరిచిపోలేదని చిలుకూరు పూర్వ విద్యార్థులు నిరూపించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా ఆర్థిక చేయూతనందించారు. 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల బ్యాచ్, శుక్రవారం పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయులు రాజారాం గారికి రూ. 26,000 విరాళాన్ని అందజేశారు. ఈ నిధులతో పాఠశాల గోడలపై విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే విధంగా సైన్స్ కు సంబంధించిన చిత్రాలు, తెలుగు ప్రముఖ రచయితల చిత్రాలు, ఇతర విద్యాపరమైన బొమ్మలు చిత్రించనున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజారాం గారు మాట్లాడుతూ, తాము చదివిన పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. వారి విరాళంతో పాఠశాల మరింత అందంగా, విద్యార్థులకు ఉపయోగకరంగా మారనుంది. ఇలాంటి సహకారం మిగతా పూర్వ విద్యార్థులకు కూడా స్ఫూర్తినిస్తుంది. వారికి పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు” అని తెలిపారు.పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, తాము విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి సహకారం అందించడం ఆనందంగా ఉందని, ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి దాతలు, పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మోటకొండూరును నూతన శాసనసభ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

తహసీల్దార్‌కు వినతి

మోటకొండూరు, నవంబర్ 20(ప్రజా వాయిస్):-

తెలంగాణ రాష్ట్రంలో చేపట్టనున్న శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూరు మండల కేంద్రాన్ని నూతన శాసనసభ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ‘జాతీయవాది’ పీసరి తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చుట్టుపక్కల ఉన్న అనేక మండలాలకు, గ్రామాలకు మోటకొండూరు ప్రధాన కేంద్రబిందువుగా ఉందని, రవాణా సౌకర్యాలు, భౌగోళిక పరిస్థితులు, జనాభా పరంగా ఇది అత్యంత కీలకమని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతాన్ని నూతన నియోజకవర్గంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయవాదులు చిర్ర రవీందర్, తండా కృష్ణ గౌడ్, అనంతుల పాండురంగారెడ్డి, ఆలేటి నాగరాజు, బాల్ద నర్సింహులు, మల్ల అశోక్, రేగు మల్లేష్, భూమండ్ల మురళి, శనిగారం ప్రదీప్, జివిలికపల్లి శ్రీను, బొబ్బల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.